హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.170	260	290
సూర్యాపేట	రూ.165	250	280
నల్లగొండ	రూ.165	245	270

ఉష్ణోగ్రత గరిష్ఠం 39.0 , కనిష్ఠం 23.0



హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై కట్టంగూరు వద్ద ప్రమాదభరితంగా ఉన్న జంక్షన్

ఆంధ్రజ్యోతి పరిశీలన

జాతీయ రహదారులపై కొరవడుతున్న రక్షణ చర్యలు

నిశీధిలో ప్రయాణం

ప్రాణమే పణం

- హైమాస్ట్ లైట్లు లేక యూటర్న్‌ల వద్ద చీకట్లు
- ప్రమాదాలకు కేరాఫ్‌లుగా పలు ప్రాంతాలు
- సమీప గ్రామాల ప్రజలకు ప్రయాణం నిత్యం ప్రాణసంకటమే
- విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్

ఉమ్మడి జిల్లాలో నిత్యం రద్దీగా ఉండే జాతీయ రహదారులు ఉన్నాయి. ఈ రహదారులపై రక్షణ కొరవడుతుండటంతో ప్రయాణికులకు నిత్యం ప్రాణ సంకటంగా మారింది. నిత్యం రాత్రి వేళల్లో ఏదో ఒక ప్రాంతంలో ప్రమాదాలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. ఫలితంగా ఎందరో ప్రాణాలు విడుస్తుండగా మరెందరో క్షతగాత్రులు అవుతున్నారు. జంక్షన్లు, యూటర్నుల వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడం, ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు హైమాస్ట్ లైట్లు వెలగకపోవడంతో ఇక్కడ రహదారిని దాటడం నరకప్రాయంగా మారింది. రహదారికి సమీపంగా ఉన్న గ్రామాల ప్రజలు నిత్యం పనులపై ఈ రహదారిపై ప్రయాణించేందుకు జంకుతున్నారు.

• 6లో..

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



ఇందిరమ్మ ఇంటి నమూనా నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

నకిరేకల్, మే 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నకిరేకల్ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్మించిన ఇందిరమ్మ నమూనా ఇంటిని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్లు అంటేనే ఇందిరమ్మ రాజ్యమని, పేదలకు ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. ప్రతీ ఎన్నికల్లో ఇందిరమ్మను గుర్తుంచుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లను వచ్చే నాలుగేళ్లలో నాలుగు విడతల్లో మంజూరు చేస్తామన్నారు. గత ప్రభుత్వంలో మంత్రులు దొరవారి ఫాంహౌస్ నుంచి జనాల వద్దకు రాలేదని విమర్శించారు. జూన్ 2న రాష్ట్రంలో ప్రతీ గ్రామానికి అధికారులు వచ్చి గ్రామంలోనే ప్రజాసమస్యలను పరిష్కరిస్తారన్నారు. రైతులకు చుట్టంగా భూభారతి చట్టాన్ని రూపొందించామన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతీ నియోజకవర్గానికి రూ.200కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మిస్తున్నామన్నారు. పేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని, రూ.500 గ్యాస్ సబ్సిడీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్న బియ్యం పంపిణీ, రూ.10లక్షల వరకు ఆరోగ్యశ్రీ పెంపు వంటి సంక్షేమ పథకాలను తమ ప్రభుత్వం అమలుచేస్తోందన్నారు. కాళేశ్వరం, మిషన్ భగీరథలో గత పాలకులు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. రూ.8లక్షల కోట్లకు పైగా అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాళా తీయించారని విమర్శించారు. గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో పేదలపై కనికరం చూపలేదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు శంకర్‌నాయక్, నెల్లికంటి సత్యం, ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, మందుల సామేలు, మదర్ డెయిరీ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, పాల్గొన్నారు. అనంతరం ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.



సంఘీభావ ర్యాలీలో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ చామల, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యేలు వీరేశం, బీఎల్‌ఆర్


విద్యార్థులకు ఆటవిడుపుగా శిబిరాలు

ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో విద్యార్థులకు ఆటవిడుపుగా వేసవి శిక్షణ శిబిరాలు ఉపయోగపడతాయని ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ కుటుంబ సభ్యుల పిల్లలకు ఉచిత మెగా సమ్మర్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వేసవికాలంలో పోలీస్ కుటుంబాలకు చెందిన పిల్లలకు ఆటవిడుపుగా ఉండాలని, ప్రత్యేకంగా చిన్ననాటి నుంచి వ్యాయామం, ఆటలపై శిక్షణ ఇచ్చి ఉన్నత స్థానాలకు ఎదగాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ప్రారంభించామన్నారు. శిబిరంలో 100 మంది విద్యార్థులకు నెలరోజుల పాటు ఉదయం, సాయంత్రం శిక్షణ ఇస్తామన్నారు. విద్యార్థులకు యోగా, కరాటే, వాలీబాల్ లాంటి తదితర క్రీడాంశాల్లో నైపుణ్యం కలిగిన పీఈటీలు, యోగా గురువులతో ప్రత్యేక శిక్షణను అందించనున్నట్లు తెలిపారు. ఆటలు, యోగాతో విద్యార్థులకు మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం లభిస్తుందన్నారు. ప్రస్తుత సమాజంలో పిల్లలు చిన్నతనం నుంచే సెల్‌ఫోన్‌కు అలవాటు పడి ఆటలపై ఆసక్తి చూపడం లేదన్నారు. సమ్మర్ క్యాంపు ద్వారా పిల్లలకు అన్ని రంగాల్లో సరైన శిక్షణ ఇస్తే విద్యార్థి దశలో క్రమశిక్షణ అలవరుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, ఆర్‌ఐలు సూరప్పనాయుడు, సంతోష్, శ్రీనివాస్, ఆర్‌ఎస్‌ఐ రాజీవ్, అశోక్, పీఈటీ నాగరాజు, కరాటే మాస్టర్ వంశీ, యోగ మాస్టర్ కిషన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



వేసవి శిబిరంలో చిన్నారులతో ఎస్పీ శరత్‌చంద్ర పవార్



విద్యుత్‌శాఖకు

బకాయిల గుదిబండ

- ప్రభుత్వరంగ సంస్థల బకాయిలు రూ.130కోట్లు
- అందులో గ్రామ పంచాయతీలవే రూ.100కోట్లు
- పాలకవర్గాలు లేకపోవడంతో పేరుకున్న బకాయిలు
- కీలకశాఖలన్నింటిలో విద్యుత్ బకాయిలు
- ప్రతీ నెల చెల్లించేలా విధానం తేవాలంటున్న విద్యుత్‌శాఖ

నల్లగొండ, మే 8 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): విద్యుత్‌శాఖకు ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు గుదిబండగా మారాయి. స్థానిక సంస్థలైన గ్రామపంచాయతీలు, మునిసిపాలిటీల్లో సైతం పెద్ద మొత్తంలో బకాయిలు పేరుకుపోయాయి. స్థానిక సంస్థల బకాయిలు అత్యధికంగా రూ.123.59కోట్లు ఉండగా, 14 రకాల ప్రభుత్వరంగ సంస్థల బకాయిలు రూ.6.06కోట్లు ఉన్నాయి. మొత్తంగా జిల్లాలో ఈ బకాయిలు సుమారు రూ.130కోట్ల మేర ఉన్నాయి. ఈ బకాయిలను దశలవారీగానైనా చెల్లించాలని హెచ్‌వోడీలకు నివేదిస్తున్నామని విద్యుత్ అధికారులు పేర్కొంటున్నారు.

జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలు, వాటి పరిధిలోని ఇతర వినియోగాల నిమిత్తం నెలనెలా వచ్చే బిల్లులకు పొంతనలేకుండా చెల్లింపులుంటున్నాయని, దీంతో ప్రతి నెలా పెండింగ్ బకాయిలు ఉంటాయని, అవి పేరుకుపోయి సంస్థకు భారంగా మారాయని విద్యుత్ అధికారులు పేర్కొంటున్నారు. ఆయా శాఖలలో సంబంధిత పద్దు కింద నిధులు విడుదలైతే తప్ప బిల్లులు చెల్లించే పరిస్థితి ఉండదు. ప్రభుత్వ కార్యాలయాలు కావడంతో నోటీసులివ్వడం తప్ప డిస్‌కనెక్ట్ చేయలేని పరిస్థితి. గృహవినియోగదారులు, వాణిజ్య, పారిశ్రామిక, ఇతర వినియోగదారులకు వర్తింపజేసినంత కఠినంగా బిల్లుల చెల్లింపునకు ఈ శాఖలపై ఒత్తిడి చేయలేని పరిస్థితి ఉంది.

పాలకవర్గాలు లేకపోవడమూ కారణం

జిల్లాలో పేరుకుపోయిన విద్యుత్ బిల్లుల బకాయిల్లో అత్యధికంగా స్థానిక సంస్థలైన పంచాయతీలు, మునిసిపాలిటీల్లో ఉన్నాయి. ప్రధానంగా పంచాయతీల్లో పెండింగ్ బిల్లులు అత్యధికంగా రూ.100కోట్లు దాటాయి. జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలు, మునిసిపాలిటీలకు సంబంధించి కార్యాలయాలు, తాగునీటి పథకాలు, వీధిదీపాల నిర్వహణకు విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుంది. దీంతో ఈ సంస్థల పద్దుల కింద కనెక్షన్లకు విద్యుత్ బిల్లులు భారీగా వస్తున్నాయి. అయితే వీటికి పాలకవర్గాలు లేకపోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన గ్రాంట్లు, కేంద్ర ఆర్థిక సంఘం నిధులు నిలిచాయి. ఫలితంగా ఈ సంస్థల విద్యుత్ బిల్లుల చెల్లింపు సామర్థ్యం తగ్గింది. గ్రామ పంచాయతీలతో పోల్చితే మునిసిపాలిటీలకు ఆస్తి, ఇంటి పన్నుల వసూళ్లతో కొంత రెవెన్యూ వస్తుండగా వాటిని అత్యవసర పనులకు వినియోగిస్తున్నారు. దీంతో విద్యుత్ బిల్లులు పెండింగ్‌లో పడిపోతున్నాయి. మునిసిపాలిటీలకు ప్రతి నెలా సగటున

మిగతా 8వ పేజీలో...

జిల్లాలో విద్యుత్ బకాయిలు ఇలా..

విభాగం	బకాయిలు (రూ.లక్షల్లో)
బీసీ వెల్ఫేర్	4,55,054
పోలీస్	42,31,039
సబ్‌జైల్	3,67,647
ఎత్తిపోతల పథకాలు	1,54,70,070
పీహెచ్‌సీలు	97,27,218
సోషల్‌వెల్ఫేర్	13,40,618
ట్రైబల్‌వెల్ఫేర్	2,12,761
రెవెన్యూ	39,28,497
ఏరియా ఆస్పత్రి	34,75,667
వెటర్నరీ	3,67,385
విద్యాశాఖ	80,46,322
పోలీస్ క్వార్టర్స్, నల్లగొండ	50,42,123
పోలీస్ క్వార్టర్స్, మిర్యాలగూడ	54,70,976
పోలీస్ క్వార్టర్స్, దేవరకొండ	25,36,790
మొత్తం	6,06,72,171
జీపీలు	100,41,08,000
మున్సిపాల్టీలు	23,18,44,000
మొత్తం	123,59,52,000
మొత్తం	129,66,24,171

● బకాయిలు చెల్లించాలని నోటీసులు ఇస్తూనే ఉన్నాం

జిల్లాలో ప్రభుత్వరంగ సంస్థల బకాయిలు సుమారు రూ.130కోట్ల వరకు ఉన్నాయి. బకాయిలు చెల్లించాలని అన్ని శాఖల ఇన్‌చార్జిలను కోరుతూనే ఉన్నాం. నోటీసులు కూడా ఇస్తున్నాం. బిల్లులు రాగానే ఆయా శాఖల నుంచి, లోకల్‌బాడీస్ నుంచి నేరుగా చెల్లిస్తూనే ఉన్నారు. అయినా పూర్తిగా బకాయిలు రావడం లేదు. ప్రతినెలా వీలైనంత ఎక్కువగా బిల్లులు వచ్చేలా ప్రయత్నం చేస్తూనే ఉన్నాం.

వెంకటేశ్వర్లు, ఎస్ఈ, నల్లగొండ

అందుబాటులో విత్తనాలు, ఎరువులు



గుర్రంపోడులో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న జేడీఏ శ్రవణ్‌కుమార్

● జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్

గుర్రంపోడు, మే 8 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతులకు సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని గుర్రంపోడు, కొప్పోలు గ్రామాల్లో ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. రైతులకు విత్తనాలు, ఎరువులు ఎంత మేర నిల్వలు అందుబాటులో ఉన్నాయో ఎరువుల దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేసి నిర్ధారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు లైసెన్స్ ఉన్న డీలర్ల వద్ద మాత్రమే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేసిన ఎరువులు, విత్తనాలకు సంబంధించిన రసీదులను తీసుకొని వాటిని భద్రపరచుకోవాలని సూచించారు. మండలంలో 473 మెట్రిక్‌టన్నుల యూరియా, 147 మెట్రిక్‌టన్నుల డీఏపీ, 43 మెట్రిక్‌టన్నుల పొటాష్, 307 మెట్రిక్‌టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 45 మెట్రిక్‌టన్నుల సింగిల్ సూపర్ పాస్పేట్ అందుబాటులో ఉందని తెలిపారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి కంచర్ల మాధవరెడ్డి, తదితరులు ఉన్నారు.



కొనుగోళ్లు నిలిచిపోవడంతో వర్షభయంతో ధాన్యం రాశులపై పట్టాలు కప్పిన రైతులు

పెద్దకాపర్తిలో నిలిచిన ధాన్యం కొనుగోళ్లు

తహసీల్దార్ చర్చల అనంతరం ప్రారంభం

చిట్యాలరూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దకాపర్తి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో గురువారం కొనుగోళ్లు నిలిచాయి. ఎగుమతి కావాల్సిన ధాన్యం లారీ అక్కడే నిలిచింది. క్వింటాకు కిలోకు పైగా కోత విధించడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యంలో నూక శాతం అధికంగా వస్తున్నందున మిల్లర్లు కోత విధిస్తూ కొనుగోళ్లు నిలిపివేశారు. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ధాన్యంలో కోతలతో నష్టం వాటిల్లుతోందని రైతులు వాపోతున్నారు. మిల్లర్లు ధాన్యాన్ని దిగుమతి చేసుకోకపోతే కొనుగోళ్లు జరగక కేంద్రంలో ఉన్న ధాన్యం అలాగే నిలిచిపోతోందని కొనుగోళ్లు జరిగేలా చూడాలని, అందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరారు. కాగా, ధాన్యం కొనుగోళ్లు నిలిచాయని తెలుసుకున్న తహసీల్దార్ కృష్ణ కొనుగోలు కేంద్రం వద్దకు వెళ్లి పరిశీలించారు. మిల్లర్లతో చర్చించి ధాన్యంలో ఎలాంటి కోతలు లేకుండా దిగుమతి చేసుకోవాలని సూచించారు. దీనికి మిల్లర్లు సరేనని ఒప్పుకున్నారు. దీంతో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. కాగా, మరో రెండు రోజుల్లో ధాన్యం పూర్తిస్థాయి కొనుగోలు చేస్తామని తహసీల్దార్ తెలిపారు.

ముచ్చటగా మూడో షెడ్యూల్

- డిగ్రీ పరీక్షలకు ముహూర్తం
- ఈ నెల 14 నుంచి జూన్ 10 వరకు సెమిస్టర్ పరీక్షలు
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి
- విడుదల చేస్తేనే సహకరిస్తాం: ప్రైవేట్ యాజమాన్యాలు

• 7లో

టోల్‌ప్లాజా వద్ద మూడు గంటల వేట

- గంజాయి సమాచారంతో మొహరించిన పోలీసులు
- లభించని ఆచూకీ

• 6లో

భార్యలను గెంటేసిన తండ్రీకుమారులు

- కోడలికి మద్దతుగా నిరసనలో పాల్గొన్న అత్త

• 6లో

ఉపాధి హామీని నిర్వీర్యం చేసేందుకు కుట్ర

బీకేఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు కాంతయ్య

నల్లగొండ రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని బీకేఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య అన్నారు. గురువారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశం సంఘ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు ఆరు గ్యారెంటీలు వర్తింపజేయాలని, కొత్త రేషన్ కార్డులు, వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల, ఒంటరి మహిళల పెన్షన్ ఇవ్వాలన్నారు. అదే విధంగా ఇల్లు లేని, ఇంటి స్థలం లేనివారికి స్థలాలు ఇచ్చి, ఇంటి



సమావేశంలో మాట్లాడుతున్న కలకొండ కాంతయ్య

నిర్మాణం కోసం రూ.6లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు లోడంగి శ్రావణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లెగిరి నర్సింహ, మాజీ జడ్పీటీసీ గోలికొండ లింగయ్య, రామకోటి, పాల్గొన్నారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రాత్రీ, పగలు తేడా లేకుండా నిత్యం రద్దీగా ఉండే హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై యూటర్న్(కుడివైపు తిరిగే ప్రాంతం)లు సామాన్యుల జీవితాల్లో చీకట్లు నింపుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో హైమాస్ట్ లైట్లు లేక, ఉన్నా వెలగకపోవడంతో రాత్రి వేళ రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డు భద్రతను, ప్రయాణికుల సంరక్షణను చూడాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ప్రజల ప్రాణాలు చీకట్లో గాలిలో కలిసిపోతున్నాయి. ఇటీవల బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి నివారణ చర్యలు చేపడుతున్న అధికారులు యూటర్న్‌ల వద్ద జాగ్రత్తలు తీసుకోవడం మరిచిపోయారు.

ఆంధ్రజ్యోతి పరిశీలన

నిశీధిలో ప్రయాణం ప్రాణమే ఫణం

హైవే అలర్ట్



కొండమడుగు మెట్టు యూటర్న్ వద్ద వేగ నియంత్రణ లేక ఢీకొట్టుకున్న రెండు కార్లు

హైదరాబాద్-వరంగల్ హైవేపై కూడా...

(ఆంధ్రజ్యోతి-బీబీనగర్)

యాదాద్రిభువనగిరి జిల్లాలోని హైదరాబాద్-వరంగల్ హైవే నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ హైవేపై ప్రయాణమంటేనే వాహనదారులు ప్రాణాలు అర చేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. బీబీనగర్ మండలం కొండమడుగు మెట్టు సర్కిల్, ఎయిమ్స్ సర్కిల్, బీబీనగర్‌లో బైపాస్ రోడ్డులోని బ్యాంకు సర్కిల్ ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. ముఖ్యంగా నిత్యం రద్దీగా ఉండే ప్రదేశాల్లో రాకపోకలు కొనసాగించడానికి అనువుగా అండర్ పాసింగ్‌లు, ఫుటోవర్ బ్రిడ్జి సౌకర్యాలు లేవు. దీంతో ప్రజలు రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలకు గురవుతు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు.

● కొండమడుగు మెట్టు సర్కిల్, పారిశ్రామిక ప్రాంతం కావడంతో పాటు, రోడ్డుకు ఇరువైపులా డాబాలు, హోటళ్లు, ఇతర దుకాణ సముదాయాలు ఎక్కువగా ఉంటాయి. దూర ప్రయాణం చేసే వాళ్లు భోజనం, విశ్రాంతి కోసం, రోడ్డు పక్కనేవాహనాలను నిలుపుదల చేస్తారు. పైగా ఈ సర్కిల్ మీదుగా బొమ్మలరామారం మండల కేంద్రానికి వెళ్లేందుకు ప్రధాన రహదారి ఇదే కావడంతో నాలుగు వైపులా రాకపోకలు సాగించే ప్రజలతో రద్దీగా ఉంటుంది. ఈ క్రమంలో ఇక్కడ వేగ నియంత్రణ హెచ్చరికలు లేక ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఎయిమ్స్ సర్కిల్..

ఎయిమ్స్‌లో ఓపీ సేవలు మొదలు పెట్టినప్పటి నుంచి వైద్యం కోసం రోగుల రాక విపరీతంగా పెరిగింది. ఇక్కడ వేగ నియంత్రణ చర్యలు మచ్చుకైనా కనిపించవు. రోగులు రోడ్డును దాటే క్రమంలో ప్రమాదాల బారిన పడి వైద్యం కోసం వచ్చి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. దూర ప్రాంతాల నుంచి బస్సులో వచ్చి తిరిగి వెళ్లే రోగులు భయం గుప్పిట్లో ప్రాణాలు పెట్టుకుని రోడ్డును దాటాల్సిన పరిస్థితి నెలకొన్నది. రోడ్డును దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృత్యువాతపడుతున్నారు.

అండర్‌పాస్, ఫుట్‌ఓవర్లు నిర్మించాలి



కొండమడుగు, ఎయిమ్స్, బీబీనగర్‌లోని బైపాస్ రోడ్డులోని సర్కిళ్ల వద్ద ప్రజలు ప్రమాదాల బారిన పడుతూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. అక్కడ అండర్‌పాసింగ్‌లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలి. ఇందుకు ఎమ్మెల్యే, ఎంపీలు చొరవ తీసుకోవాలి.

భువనగిరి సదానంద్ గౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు.

చర్యలు తీసుకుంటాం

హైదరాబాద్-వరంగల్ జాతీయరహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాలు, సూచనల మేరకు ఎప్పటికప్పుడు హైవేపై పెట్రోలింగ్, డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నాం. ప్రమాదాల హెచ్చరిక సూచికలు ఏర్పాట్లు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. ప్రయాణికులు సైతం జాగ్రత్తలు తీసుకోవాలి



ప్రభాకర్‌రెడ్డి, సీఐ బీబీనగర్



చిమ్మచీకట్లు

నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామశివారులోని హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై యూటర్న్ దగ్గర ప్రస్తుత పరిస్థితి ఇది. చిమ్మచీకట్లు ఉన్న ప్రాంతం. చుట్టుపక్కల నాలుగు గ్రామాల ప్రజలకు రోడ్డు దాటేందుకు ఇదే దిక్కు. పంతంగి టోల్‌గేట్ దాటాక వచ్చే మొదటి యూటర్న్ కూడా ఇదే. దీంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఇక్కడ హైమాస్ట్ లైట్లు ఏర్పాటుచేయకపోవడంతో రాత్రి వేళ రోడ్డు దాటే క్రమంలో ప్రజలు ప్రమాదాల బారిన పడి మృత్యువాత పడుతున్నారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో హైదరాబాద్--విజయవాడ రహదారి విస్తరించి ఉంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలను అనుసంధానం చేసే రహదారి కావడంతో నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఈ హైవేపై ప్రమాదాలు నిత్యకృత్యం.

● హైమాస్ట్ లైట్లు లేక యూటర్న్‌ల వద్ద చీకట్లు
● ప్రమాదాలకు కేరాఫ్‌లుగా ప్రాంతాలు
● సమీప గ్రామాల ప్రజలకు ప్రయాణం నిత్యం ప్రాణసంకటమే
● విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్

(ఆంధ్రజ్యోతి-చిట్యాలరూరల్/చిట్యాల)

నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి సుమారు 19కిలోమీటర్లు ఉంటుంది. గుండ్రాంపల్లి నుంచి మొదలై వెలిమినేడు, పెద్దకాపర్తి, చిట్యాల, వట్టిమర్తి బస్‌స్టేజీ వరకు రహదారి విస్తరించి ఉంది. ఈ హైవేపై ఆరు బ్లాక్‌స్పాట్‌లుగా యూటర్న్‌లను అధికారులు గుర్తించారు. అందులో గుండ్రాంపల్లి డబుల్‌బెడ్‌రూం సమీపంలో, సుర్కంటిగూడెంకు వెళ్ళే దారి వద్ద, వెలిమినేడు దాటాక శివారులో పిట్టంపల్లి వెళ్లే దారి వద్ద, పెద్దకాపర్తి శివారులో చెరువు వద్ద, చిట్యాల రైల్వేస్టేషన్‌కు వెళ్ళేదారిలో, వట్టిమర్తి బస్‌స్టేజి వద్ద ఉన్నాయి.

రోడ్డు దాటడం ప్రధాన సమస్య

వివిధగ్రామాలకు వెళ్లేందుకు ప్రజలు యూటర్న్ వద్ద రోడ్డు దాటుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. హైమాస్ట్ లైట్లు లేక రాత్రి వాహనాల రాక కనిపించకపోవడంతో చీకట్లో వేగంగా రావడంతో ప్రమాదాలు జరుతున్నాయి.

● చిట్యాల పట్టణంలో జాతీయరహదారి పైన, సర్వీస్‌రోడ్డులో ఏర్పాటుచేసిన హైమాస్ట్ లైట్లు వెలగడంలేదు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. లైట్లు ఎప్పుడు వెలుగతాయో, ఎప్పుడు వెలగవో తెలియని పరిస్థితి నెలకొంది. హైవేపై ఫ్లైఓవర్ బ్రిడ్జ్ నిర్మిస్తున్న నేపథ్యంలో ట్రాఫిక్ కొంతమేర సర్వీస్ రోడ్డులోనే వెళ్తోంది. ఇక్కడ లైట్లు వెలగకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి పరిధిలోని హైదరాబాద్-విజయవాడ హైవేపై గోపలాయపల్లి ఆర్చి వద్ద యూటర్న్ ఉంది. దీంతో పాటు నల్లగొండ ఫ్లైఓవర్ బ్రిడ్జి, నార్కట్‌పల్లి పట్టణం నుంచి కామినేని ఆసుపత్రికి వెళ్లే రోడ్డులో ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్డు వద్ద భారీ హైమాస్ట్ లైట్ల ఏర్పాటుచేసి నిర్వహణ గాలికొదిలేయడంతో వెలగక రాత్రివేళ ప్రమాదాలబారిన పడుతున్నారు. గోపలాయపల్లి దేవాలయ ఆర్చి వద్ద రాత్రివేళ యూటర్న్ చేయడానికి ముఖ్యంగా ద్విచక్ర వాహనచోదకులు భయపడుతున్నారు.

హైమాస్ట్ లైట్లు వెలగక ప్రమాదాలు



హైదరాబాద్-విజయవాడ హైవేపై వాహనాల రద్దీ పెరిగింది. గోపలాయపల్లి ఆర్చి ఎదుటున్న యూటర్న్ వద్ద పగటిపూటనే రోడ్డు దాటాలంటే భయం. రాత్రి వేళ హైమాస్ట్ లైట్లు లేక రోడ్డు దాటాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోంది. హైమాస్ట్‌లైట్లు ఏర్పాటు చేయాలి.

యాట చంద్రశేఖర్, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు, నార్కట్‌పల్లి

సోలార్ లైట్లు అమరుస్తాం

హైదరాబాద్-విజయ వాడ హైవేపై నార్కట్‌పల్లి పరిధి గోపలాయపల్లి దేవస్థాన ఆర్చి ఎదురుగా ఉన్న యూటర్న్‌ల వద్ద పంచాయతీ ఆధ్వర్యంలో తక్కువ వెలుతురు చ్చే లైట్లునే ఏర్పాటు చేశారు. అవి మరమ్మతులకు గురవుతున్నాయి. ప్రస్తుతం ఈ జంక్షన్‌కు సోలార్ లైట్లు మంజూరుచేశారు. అవి రావడానికి సమయం పడుతుంది. అప్పటిలోగా ప్రస్తుత లైట్లకు మరమ్మతులు చేయిస్తాం.

నాగకృష్ణ, హైవే ఇన్‌చార్జి

పోలీసులకూ తప్పని తిప్పలు

మునగాల : సూర్యాపేట జిల్లా మునగాల మండలంలో హైవే ఏర్పాటు చేసిన నాటి నుంచి ప్రమాదాలు తగ్గడం లేదు. యూటర్న్‌ల వద్ద హైమాస్ట్, సిగ్నల్ లైట్స్, ప్రమాద చూచిక బోర్డులు ఏర్పాటుచేయకపోవటంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. మునగాల మండలం మాధవరం,మొద్దులచెర్వు, తాడ్వాయి, మునగాల, ముకుందాపురం, ఆకుపాముల వద్ద ఉన్న యూటర్న్‌ల సిగ్నల్ ఇండికేటర్ లైట్స్, హైమాస్ట్ లైట్స్ ప్రమాదచూచిక బోర్డులు ఏర్పాటుచేయకపోవడంతో ప్రజల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ప్రమాదాల నివారణకు వన్‌వే స్టాప్ బోర్డులను ఏర్పాటుచేశారు. పగటిపూట గమనించి నెమ్మదిగా వెళ్తున్నారు. కానీ రాత్రి వేళ వెళుతురు లేక అతివేగంగా వచ్చే వాహనాలు స్టాప్‌బోర్డులకు ఢీకొంటున్నాయి. ఇలా ఢీకొన్న ప్రతీసారి నూతన బోర్డులు ఏర్పాటుచేయలేక పోలీస్ యంత్రాంగం కూడా నానా ఇబ్బందులు పడుతోంది.

14 యూటర్న్‌లు.. ఒక చోటే హైమాస్ట్

(ఆంధ్రజ్యోతి-చౌటుప్పల్ రూరల్)

చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట నుంచి గుండ్లబావి వరకు 14యూటర్న్‌లు ఉన్నాయి. అంకిరెడ్డిగూడెం యూటర్న్ వద్ద దివీస్ సంస్థ హైమాస్ట్ లైట్లు ఏర్పాటుచేసింది. మిగతా ఏ ప్రాంతంలోనూ హైమాస్ట్ లైట్లులేవు. ఇందుకోసం జాతీయ రహదారుల సంస్థ ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో యూటర్న్‌ల వద్ద రాత్రి వేళ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సిగ్నలింగ్ వ్యవస్థ, స్పీడ్ బ్రేకర్లు, బారికేడ్లు వంటి నివారణ చర్యలు లేవు. దీంతో ఈ ప్రాంతంలో ప్రమాదాలు నిత్యకృత్యమై అనేక మంది మృత్యువాత పడుతున్నారు. అనేక మంది క్షతగాత్రులయ్యారు. ధర్మోజిగూడెం వద్ద ఎక్కువగా ప్రమాదాలు జరుగుతుండడంతో ఆ ప్రాంతాల్లో అండర్ పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేస్తున్నారు.



ఆందోళ్ మైసమ్మ గుడి సమీపంలోని యూటర్న్

ఆరుచోట్ల..

కేతేపల్లి : కేతేపల్లి మండలంలో దాదాపు 10 కిలోమీటర్ల మేర హైదరాబాద్-విజయవాడ హైవే విస్తరించి ఉంది. ఈ రహదారిపై మండలంలోని ఇనుపాముల మల్లన్నగుట్ట వద్ద, కొర్లపహాడ్ బస్‌స్టేజీ వద్ద, మండల కేంద్రం కేతేపల్లిలోని డీపాల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల వద్ద, ఎస్సీ కాలనీ వద్ద, చీకటిగూడెం బస్‌స్టేజీ వద్ద, ఉప్పలపహాడ్ సమీపంలో మొత్తంగా ఆరు యూటర్న్‌లు ఉన్నాయి. హైవే మీదుగా దూర ప్రాంతాలకు అత్యంత వేగంగా వెళ్లే వాహనచోదకులు రహదారిపై ఈ యూటర్న్‌లను గుర్తించేలా చర్యలు మాత్రం చేపట్టలేదు. చీకటిగూడెం బస్‌స్టేజీ వద్ద గల యూటర్న్ వద్ద మాత్రమే సోలార్‌తో పనిచేసే బ్లింకర్‌లు, డేంజర్ లైట్లను ఏర్పాటుచేశారు. రహదారి వెంట గ్రామాల ప్రజలు, మూగజీవాలు ఈ యూటర్న్‌ల వద్ద రోడ్డును దాటేందుకు యత్నించే క్రమంలో రహదారిపై వేగంగా వచ్చే వాహనాలు ఢీకొని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.



కేతేపల్లిలో యూటర్న్‌ను సూచించే ఎలాంటి హెచ్చరికలు లేని జంక్షన్

మృత్యుఘటనలు

● నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు పరిధిలోని సుర్కంటిగూడెంకు చెందిన రైతు సుర్కంటి ప్రతాప్‌రెడ్డి ఏప్రిల్ 5వ తేదీ రాత్రి వ్యక్తిగత పనిమీద రోడ్డు మీదకు వచ్చాడు. పనిపూర్తయి తిరిగి గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో గ్రామానికి వెళ్ళే క్రమంలో గుండ్రాంపల్లిలోని డబుల్‌బెడ్‌రూం ఇళ్ల సమీపంలోని యూటర్న్ వద్ద రోడ్డును దాటుతున్నాడు. చీకట్లో అతడు కనిపించకపోవడంతో హైదరాబాద్ నుంచి వస్తున్న గుర్తుతెలియని వాహనం ప్రతాప్ ఎరెడ్డిని ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు.

● సూర్యాపేట జిల్లా మునగాల మండలం మాధవరం గ్రామ సమీపంలో నేలమర్రి స్టేజీ యూటర్న్ వద్ద బైక్ యూటర్న్ తీసుకుంటున్న క్రమంలో 2024న ఆగస్టు 18 నర్సింహులగూడెం గ్రామానికి చెందిన రాంపంగు సురేష్ మృతి చెందారు. అదేవిధంగా తాడ్వాయి స్టేజీ వద్ద ఆరురోజుల తర్వాత ఆగస్టున 24న బైక్ యూటర్న్ తీసుకుంటుండగా తాడ్వాయికి చెం దిన మునగాల మెడికల్ షాపు యజమాని రాంబాబు అక్కడికక్కడే మృతి చెందారు.



మునగాల మండల కేంద్రంలో ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేని యూటర్న్

అండర్ పాస్‌లు వేయాలి



హైవే వెంట ఉన్న గ్రామాల స్టేజీల వద్ద అండర్‌పాస్‌లు, సర్వీస్ రోడ్లు వేయాలి. 15 ఏళ్లుగా ఆయా యూటర్న్‌ల వద్ద రాత్రి వేళ చీకటల్లో ఎంతోమంది ప్రజల ప్రాణాలు కోల్పోయారు. ఇందుకు ఎన్‌హెచ్ అధికారుల వైఫల్యమే కారణం. ప్రస్తుతం జరుగుతున్న మరో రోడ్డు లైన్ విస్తరణలో రీడిజైన్ చేసి అండర్ పాసింగ్‌లు ఏర్పాటుచేయాలి.

ఆంజనేయశర్మ, సామాజిక ఉద్యమ కారుడు

ప్రమాద నివారణ చర్యలు చేపడతాం



హైవేపై యూటర్న్‌ల వద్ద ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడతాం. ఇప్పటికే రోడ్డు స్టాపర్స్‌ను ఏర్పాటుచేశాం. అదేవిధంగా సిగ్నల్ లైట్లు ఏర్పాటుచేశాం. అయినప్పటికి వాహనదారులు వేగంగా వచ్చి ప్రమాదాలకు కారకులవుతున్నారు.

పార్థసారథి, డీఎస్పీ సూర్యాపేట.

● జీఎంఆర్ వదిలేశాక..

(ఆంధ్రజ్యోతి-కేతేపల్లి/కోదాడ రూరల్)



డివైడర్లపై ఎండిపోతున్న చెట్లు

హైదరాబాద్ -విజయవాడ రహదారి విస్తరణ పనులు 2011-12లో పూర్తి చేసిన జీఎమ్మార్ సంస్థ గత 10 నెలల క్రితం వరకూ టోల్ వసూలు, రహదారి నిర్వహణ బాధ్యతలు చూసేది. అయితే జీఎమ్మార్ తప్పుకోవడంతో టోల్ వసూలు, రహదారి నిర్వహణలను ఎన్‌హెచ్‌ఏఐ వేర్వేరు సంస్థలకు తాత్కాలిక ప్రాతిపదికన అప్పగించింది. దీంతో అప్పటివరకు కొంతలో కొంత మెరుగ్గా ఉండే హైవే నిర్వహణ ప్రస్తుతం అస్తవ్యస్తంగా మారిపోయింది. యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండం పంతంగి వద్ద, నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ వద్ద, ఏపీలోని కృష్ణా జిల్లాలో గల టోల్‌ప్లాజాల్లో టోల్ వసూళ్లను వేర్వేరు సంస్థలు నిర్వహిస్తుండగా దాదాపు 183కిలోమీటర్ల పొడవు గల ఈ రహదారి నిర్వహణ పనులను మాత్రం ఒకే సంస్థకు అప్పగించారు. దీంతో ఇంత పొడవైన ఈ హైవేపై వారు ఎప్పుడు, ఎక్కడ, పనులు చేస్తున్నారో, సమస్య ఉంటే ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది. రహదారిపై ఎక్కడబడితే అక్కడ వాహనాలు నిలిపివేస్తున్నా పట్టించుకునే వారే లేరు. గతంలో ఏదైనా వాహనం మరమ్మతులకు గురై రోడ్డుపై నిలిచిపోతే జీఎమ్మార్ పెట్రోలింగ్ వాహన సిబ్బంది సదరు వాహనాన్ని రోడ్డు పక్కకు తరలించేవారు. ప్రస్తుతం అలాంటిదేమీ లేక రోడ్డు వెంట వాహనాలు నిలుపుతుండటంతో ప్రమా దాలు జరుగుతున్నాయి. వాహన డ్రైవర్లకు లైట్ల వెలుతురుతో ఇబ్బంది కాకుండా డివైడర్‌పై పెద్ద సంఖ్యలో మొక్కలను నాటి పెంచారు. ప్రస్తుతం ఆ మొక్కలకు నీరు సక్రమంగా అందక చాలా వరకు చనిపోతున్నాయి.

కొన్నిచోట్ల అండర్‌పాస్‌లు..



అంజనాపురి కాలనీ వద్ద ఉన్న యూటర్న్

సూర్యాపేట క్రైం : సూర్యాపేట జిల్లాలో హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారిపై ప్రమాదాల నివారణకు ఇటీవల ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ఆయాచోట్ల అండర్ పాస్‌లు నిర్మిస్తున్నారు. మరికొన్ని చోట్ల జంక్షన్లను అభివృద్ధి చేస్తున్నారు. కాగా యూటర్న్‌ల వద్ద జాగ్రత్తలు మరిచిపోయారు. జిల్లాలోని టేకుమట్ల, రాయినిగూడం, పిల్లలమర్రి క్రాస్‌రోడ్డు, అంజానాపురి కాలనీ, వ్యవసాయమార్కెట్, ఎఫ్‌సీఐ గోదాంలు, దురాజ్‌పల్లి, గుంజలూరు గ్రామ స్టేజీల వద్ద ఏర్పాటుచేసిన యూటర్న్‌ల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. టేకుమట్ల స్టేజీ వద్ద ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదు. రాయినిగూడెం వద్ద ఉన్న యూటర్న్ ప్రమాదకరంగా మారింది. పిల్లలమర్రి క్రాస్‌రోడ్డు యూటర్న్ వద్ద రోడ్డు స్టాపర్స్‌ను ఏర్పాటుచేశారు. రాత్రి సమయాల్లో వాహనాలు ఢీకొంటున్నాయి.

రెండు నెలలుగా వెలగని లైట్లు

కోదాడ రూరల్ : సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారి పక్కన ఉన్న గ్రామాల్లో సర్వీస్ రోడ్లపై లైట్లు వెలగక వాహనదారులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో సుమారు 15 కిలోమీటర్ల హైవే ఉంది. దీనిపై నల్లబండగూడెం, చిమిర్యాల, రామాపురం వద్ద యూటర్న్‌లు ఉన్నాయి. ఆయాచోట్ల ఉన్న హైమాస్ట్ లైట్లు ఎప్పుడు వెలుగుతాయో, ఎప్పుడు పోతాయో తెలియని పరిస్థితి. ఓ వైపు వెలిగితే మరో వైపు వెలగవు. దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

సర్వీస్ రోడ్లలోనూ..

హైవే వెంట గ్రామాల పరిధిలో ప్రజల రాకపోకలకు వీలుగా జాతీయ రహదారితో సంబంధం లేకుండా సర్వీస్ రోడ్లు ఏర్పాటుచేశారు. అయితే రోడ్డు వెంట వేసిన లైట్లు రెండు నెలలుగా వెలగక ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజలు తెలిపారు. రాత్రి వేళ బయటికి వెళ్లాలంటేనే భయమేస్తుందన్నారు. గతంలోనైనా రోడ్లు ఊడ్చేవారని, ప్రస్తుతం పట్టించుకునే వారే లేరని గ్రామస్థులు తెలిపారు.



దోరకుంటలోని సర్వీస్ రోడ్లపై వెలగని లైట్లు

టోల్‌ప్లాజా వద్ద మూడు గంటల వేట..

● గంజాయి సరఫరా సమాచారంతో మొహరించిన పోలీసులు ● అయినా లభించని ఆచూకీ



కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

కేతేపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి) : భారీగా గంజాయి తరలుతుందనే సమాచారంతో మూడు గంటల పాటు విస్తృత తనిఖీలు చేపట్టినా పోలీసులకు ఎటువంటి ఆచూకీ లభించలేదు. విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి మీదుగా గంజాయి తరలుతుందన్న సమాచారం పోలీసులకు వచ్చింది. దీంతో నల్లగొండ జిల్లా కేతేపల్లి సమీపంలోని టోల్‌ప్లాజా వద్దకు జిల్లాలోని నల్లగొండ, చండూరు, నకిరేకల్ డివిజన్లకు చెందిన ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసు సిబ్బంది పెద్దఎత్తున గురువారం సాయంత్రం 4గంటలకు చేరుకున్నారు. ఆంధ్రప్రదేశ్ వైపు నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్లే ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి వదిలారు. రాత్రి 7 గంటల వరకు నిర్వహించిన ఈ వాహన తనిఖీలు కొనసాగాయి. అయినప్పటికీ గంజాయి పట్టుబడలేదని సమాచారం.

కళ్లలో కారం కొట్టి బంగారు గొలుసు చోరీ

నేరేడుచర్ల, మే 8 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణంలో వృద్ధురాలి కళ్లలో కారం కొట్టి బంగారు గొలుసును చోరీ చేశారు. ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నేరేడుచర్లకు చెందిన గుండా చంద్రకళ(62) తన ఇంట్లో ఉండగా గురువారం సాయంత్రం ఓ మహిళ వచ్చి తాగు నీరు కావాలంది. ఆమె నీరు తెచ్చి ఇచ్చింది. నీళ్లు తాగుతూ బాటిల్ మూతను కిందకు పడేసింది. మూతను తీసేందుకు చంద్రకళ వంగగా గుర్తుతెలియని మహిళ చంద్రకళ కళ్లలో కారంకొట్టి ఆమె మెడలోని రెండు తులాల బంగారుపుస్తెలతాడును లాక్కెళ్లింది. చంద్రకళ బయటకు వచ్చి చుట్టుపక్కల వారికి సమాచారం ఇవ్వడంతో వారు పోలీసులకు సమాచారమిచ్చినట్లు ఎస్ఐ తెలిపారు. సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు తెలుసుకుని అనుమానితురాలి కోసం ప్రయత్నిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. చంద్రకళ కుమారుడు సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భార్యలను గెంటేసిన తండ్రీకుమారులు

● కోడలికి మద్దతుగా నిరసనలో పాల్గొన్న అత్త

నార్కట్‌పల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): వాళ్లిద్దరూ ఒకింటి అత్తా కోడళ్లు. కానీ భర్తలు చేసిన నిర్వాకానికి ఓపిక నశించి ఇంటి ఎదుట నిరసనకు దిగారు. ఆందోళన విషయం ముందే తెలుసుకున్న తండ్రీకుమారులిద్దరూ ఇంటికి తాళం వేసి పరారయ్యారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల కేంద్రంలో గురువారం ఈ ఘటన జరిగింది. బాధిత అత్తాకోడళ్లకు ఐద్వా అండగా నిలిచింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నార్కట్‌పల్లికి చెందిన బద్దుల మల్లేశ్ నల్లగొండ ఆర్టీసీ డిపోలో మెకానిక్‌గా పనిచేస్తుండగా, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 12ఏళ్ల క్రితం మల్లేశ్ భార్య మృతిచెందగా, కుటుంబ బాధ్యతలు చూసుకోవడం కోసం చిట్యాల మండలం నేరడ గ్రామానికి చెందిన యాదమ్మను రెండో పెళ్లి చేసుకున్నాడు. కానీ ఆమె ద్వారా సంతానం లేదు. మల్లేశ్ తన మొదటి భార్యకు కలిగిన నలుగురి సంతానానికి పెళ్లిళ్లు చేశాడు. రెండో కుమారుడు మహేశ్‌కు తిప్పర్తి మండలానికి చెందిన దుర్గామల్లేశ్వరితో 2021లో వివాహంకాగా, మూడేళ్ల కుమార్తె ఉంది. మహేశ్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండగా, భార్య దుర్గామల్లేశ్వరి ప్రైవేటు ఉద్యోగం చేస్తోంది. మల్లేశ్ తన భార్య యాదమ్మను రెండేళ్ల క్రితమే ఇంటినుంచి గెంటేయడంతో నేరడకు వెళ్లి పలుమార్లు పెద్దమనుషులతో పంచాయితీ పెట్టింది. ఇదిలాఉండగా మహేశ్ కూడా భార్య దుర్గామల్లేశ్వరితో ఏడాది క్రితం గొడవపడి ఆమెను తల్లిగారింటికి పంపగా, పెద్దమనుషుల పంచాయితీకి చేరింది. నాలుగు రోజుల క్రితం దుర్గామల్లేశ్వరికి మహేష్ విడాకుల నోటీస్ పంపించాడు. దీంతో ఇంతకాలం భరిస్తూ వచ్చిన ఆమె గురువారం నార్కట్‌పల్లికి వచ్చి అత్తగారింటి ఎదుట ధర్నాకు దిగింది. కోడలు ధర్నాకు దిగిన విషయం తెలుసుకున్న యాదమ్మ కూడా తనకూ తన భర్త మల్లేశ్ అన్యాయం చేశాడని ఆరోపిస్తూ కోడలితోపాటు దీక్షలో కూర్చుంది. అత్తాకోడళ్ల ఆందోళనకు ఐద్వా నాయకురాలు పాలడుగు ప్రభావతి, సరోజ, నాగమణిలు అండగా నిలిచారు. దీక్షలో సక్కు లక్ష్మమ్మ, బాల నర్సమ్మ, లింగాల మల్లమ్మ, రేణుక, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు. రాత్రి తొమ్మిది గంటల వరకు అత్తా కోడళ్ల నిరసన కొనసాగగా, ఇంటికి తాళం వేసి ఉంది.



నార్కట్‌పల్లిలో ధర్నాచేస్తున్న అత్తాకోడళ్లు యాదమ్మ, దుర్గా మల్లేశ్వరి, మద్దతుగా దీక్షలో కూర్చున్న మహిళా సంఘాల నేతలు

ఓటింగ్ ప్రక్రియలో పారదర్శకత

ఓటరు జాబితా ఖచ్చితంగా ఉండేందుకు జనన, మరణ రికార్డులు అనుసంధానం చేసేలా ఎన్నికల సంఘం చర్యలు చేబడుతుండటంతో పలువురు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ విధానంతో ఓటింగ్ ప్రక్రియలో పారదర్శకత వస్తుందని అభిప్రాయపడ్డారు. ఇది శుభపరిణామమని పేర్కొన్నారు.

- సూర్యాపేటటౌన్, ఆంధ్రజ్యోతి

ఓటింగ్ ప్రక్రియలో పారదర్శకత



ఓటర్ల జాబితాకు జనన, మరణ రికార్డులు జత చేయడంతో ఓటింగ్ ప్రక్రియలో పారదర్శకత వస్తుంది. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఉంటుంది. గతంలో జరిగే ఎన్నికల రిగ్గింగుకు ఆస్కారం ఉండదు. నేటి ఆధునిక యుగంలో ఎలాంటి పొరపాట్లకు తా వులేకుండా ఇలాంటి విధానం చాలా అవసరం ఉంది. ఇది ముమ్మాటికి హర్షణీయం.

- కొత్తపల్లి రేణుక, సూర్యాపేట

సరైన ఓటింగ్ వ్యవస్థ ఏర్పాటు



ఓటర్ల జాబితాకు జనన, మరణ రికార్డులు జారీ చేయడం వల్ల సరైనా ఓటింగ్ వ్యవస్థ ఏర్పడుతుంది. ఏ చిన్న తప్పుకు ఆస్కారం ఉండదు. ఎన్నికల జాబితాలో మరణించిన వారి వివరాలు ఓటింగ్‌లో ఉండక పోవడం వల్ల ఓట్లు అవినీతి జరగదు. మరణించిన వారి వివరాలు ఖచ్చితంగా తొలగించాల్సిందే. మరణాలు తొలగించడంతో ఓటర్ల జాబితాలో పేర్లను సులభంగా చూడవచ్చు.

- పద్మ, సూర్యాపేట

ఓటర్ల జాబితాలో కచ్చితత్వం



ఓటర్ల జాబితాకు జనన, మరణ అనుసంధానంతో ఓటర్ల జాబితాలో ఖచ్చితత్వం పెరుగుతుంది. ముఖ్యంగా చిన్న పొరపాట్లు ఉన్న అవకాశవాదులకు అనువుగా మార్చుకునే వారు. ఇప్పుడు అలాంటి అవకాశం ఉండదు. మరణించిన వారి కుటుంబ సభ్యులు వివరాలు ఇచ్చే లోపు ఓటర్ల జాబితాలో పేరు మారక ఇబ్బంది ఎదురవుతుంది. బూత్‌స్థాయి అధికారులు వివరాలను పకడ్బందీగా సేకరించి మరణాల వివరాలను పొందుపర్చాలి. ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా చూడాలి.

- పేర్ల నాగయ్య, సూర్యాపేట

మృతి చెందిన వారి వివరాలు అలానే ఉంటున్నాయి



గతంలో మరణించిన వారి వివరాలు అధికారుల వద్ద లేక నూతన ఓటరు జాబితాలో వారి పేర్లు వచ్చేవి. ప్రస్తుతం ఎన్నికల సంఘం తీసుకొస్తున్న విధానంతో ఓటర్ల జాబితాలో పారదర్శకత వస్తుంది. ఎలాంటి దొంగ ఓటుకు అవకాశం ఉండదు. ఆర్‌జీఐ నుంచి నేరుగా మరణాలు సమాచారం తీసుకొని ఓటర్ల జాబితాను మరింత పటిష్టంగా మార్చడం గొప్ప చర్య.

- నాశబోయిన శ్రీధర్, సూర్యాపేట

ముచ్చటగా మూడో షెడ్యూల్

- డిగ్రీ పరీక్షలకు ముహూర్తం
- మే 14 నుంచి జూన్ 10 వరకు సెమిస్టర్ పరీక్షలు
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి
- విడుదల చేస్తేనే సహకరిస్తాం : ప్రైవేట్ యాజమాన్యాలు



డిగ్రీ పరీక్షల షెడ్యూల్ విడుదల చేస్తున్న ఎంజీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ అల్తాఫ్ హుస్సేన్

భువనగిరి టౌన్, మే 8(ఆంధ్రజ్యోతి): డిగ్రీ సెమిస్టర్ పరీక్షలకు ముచ్చటగా మూడోసారి మహాత్మాగాంధీ యూనివర్సిటీ (ఎంజీయూ) షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఎంజీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ అల్తాఫ్ హుస్సేన్ గురువారం షెడ్యూల్ జారీ చేశారు. ఈ షెడ్యూల్ ప్రకారం మే 14 నుంచి జూన్ 10 వరకు ఒకటి నుంచి 6వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్‌లు, 2, 4, 6వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు జరగనున్నాయి. అయితే షెడ్యూల్‌లో ప్రాక్టికల్స్ పరీక్షల ప్రస్తావన లేకపోవడంతో థియరీ పరీక్షల అనంతరం ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించే యోచనలో యూనివర్సిటీ ఉన్నట్లు తెలుస్తోంది. పీజీసెట్ పరీక్ష తేదీలు సమీపిస్తున్న నేపథ్యంలో ఇప్పుడైనా డిగ్రీ పరీక్షలు సజావుగా నిర్వహించాలని విద్యార్థులు కోరుతున్నారు. ప్రైవేట్ యాజమాన్యాలు తమకు రావాల్సిన పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేస్తేనే పరీక్షల నిర్వహణకు సహకరిస్తామని లేనిచో బహిష్కరిస్తామని మునుపటి వాదననే మరోమారు తెరపైకి తీసుకొస్తున్నారు. దీంతో పరీక్షల నిర్వహణ ప్రభుత్వ గోల్‌లోకి చేరింది. యాజమాన్యాల డిమాండ్ మేరకు బకాయిలను విడుదల చేసి పరీక్షల నిర్వహణకు సహకరిస్తుందా? లేక ఇప్పటి వరకు ప్రదర్శిస్తున్న మొండి వైఖరినే కొనసాగించనుందో వేచిచూడాలి. రాష్ట్రంలోని మరో 4 యూనివర్సిటీలు కూడా వాయిదా పడిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షల రీషెడ్యూల్‌ను విడుదల చేశాయి.

ముచ్చటగా మూడోసారి...

ఒకే విద్యా సంవత్సరంలో ఒకే విధమైన డిగ్రీ సెమిస్టర్ పరీక్షలకు ముచ్చటగా మూడోసారి షెడ్యూల్ జారీ చేయడం ఎంజీయూ చరిత్రలో సుమారుగా ఇదే ప్రథమని పలువురు పేర్కొంటున్నారు. మూడేళ్లుగా ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో ఎంజీయూ పరిధిలోని 62 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు తమకు రావాల్సిన సుమారు రూ.100 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం పరీక్షలపై బహిష్కరణాస్త్రాన్ని ప్రయోగించాయి. దీంతో 2024-25 విద్యా సంవత్సరానికి ఏప్రిల్ 2 నుంచి 9వ తేదీ వరకు జరుగాల్సిన 2, 4, 6 రెగ్యులర్, 1, 3, 5 బ్యాక్‌లాగ్ ప్రాక్టికల్స్ పరీక్షలు వాయిదాపడ్డాయి. అలాగే ఏప్రిల్ 11వ తేదీ నుంచి ప్రారంభం కావాల్సిన 1 నుంచి 6 సెమిస్టర్స్ బ్యాక్‌లాగ్, 2, 4, 6 సెమిస్టర్స్ రెగ్యులర్ పరీక్షలను ఏప్రిల్ 17వ తేదీ వరకు వాయిదా వేశారు. అయినా ప్రైవేట్ యాజమాన్యాలు మెట్టు దిగకపోవడంతో ఏకంగా మే 14వ తేదీ వరకు సెమిస్టర్ పరీక్షలను యూనివర్సిటీ వాయిదా వేసింది. ప్రైవేట్ యాజమాన్యాల బహిష్కరణాస్త్రంతో అన్ని కళాశాలల్లో ప్రాక్టికల్స్, సెమిస్టర్ పరీక్షలు నిర్వహించలేదు. ఈ నేపథ్యంలో వాయిదా పడిన థియరీ పరీక్షలన్నింటినీ మే 14 నుంచి జూన్ 10వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు యూనివర్సిటీ ముచ్చటగా మూడోసారి పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించింది. ఇప్పుడైనా ప్రభుత్వం స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసి పరీక్షల నిర్వహణకు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలపై ప్రభుత్వ వైఖరిలో మార్పురాకుంటే మరోమారు పరీక్షలను బహిష్కరిస్తామని తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యజమాన్యాల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సూర్యనారాయణరెడ్డి స్పష్టం చేశారు. దీంతో పరీక్షల నిర్వహణపై జిల్లాలోని సుమారు 25వేల మంది డిగ్రీ విద్యార్థుల్లో ఉత్కంఠ నెలకొంది.

మే 14 నుంచి ఎంజీయూ డిగ్రీ పరీక్షలు

నల్లగొండ టౌన్ : ఎంజీయూ పరిధిలోని డిగ్రీ పరీక్షలను మే 14 నుంచి నిర్వహించనున్నట్లు సీఈవో డాక్టర్ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. గతంలో వాయిదా వేసిన పరీక్షల నూతన టైం టేబుల్ ను ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ ఆచార్య అలువాల రవిలతో కలిసి గురువారం విడుదల చేశారు. పూర్తి వివరాలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు ఆయన తెలిపారు.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	513.60
టీఎంసీలు	137.8642
ఎడమకాల్వకు నీటి విడుదల	నిల్
కుడికాల్వకు	నిల్
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్‌ఎల్‌బీసీ ద్వారా	1350 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	1350 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	0

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	26.36 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	633.00 అడుగులు
టీఎంసీలు	1.84
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	627.77 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	64.86 క్యూసెక్కులు

రేపటి నుంచి మట్టపల్లి ఆలయ బ్రహ్మోత్సవాలు

- హాజరుకానున్న వేలాది మంది భక్తులు
- ఏర్పాట్లు పూర్తిచేసిన ఆలయ కమిటీ
- వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



ఆలయ ప్రాగణంలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

మఠంపల్లి మే 8 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లాలోని కృష్ణానది తీరంలో మఠంపల్లి మండలం మట్టపల్లి వద్ద స్వయంభు లక్ష్మీనృసింహుని ఆలయంలో శనివారం నుంచి బ్రహ్మోత్సవాలను నిర్వహించడానికి సిద్ధం చేశారు. ఈ క్షేత్రం 1200 ఏళ్ల క్రితం ఏర్పడింది. ఇక్కడ ప్రశాంతంగా ప్రవహించే కృష్ణమ్మ ఉప్పొంగి రెండు పర్యాయలు స్వామివారి కంఠాన్ని తాకింది. రెండు తెలుగు రాష్ట్రాల భక్తులతో పాటు దేశంలోని అనేక రాష్ట్రాలకు చెందిన భక్తులు స్వామి వారిని దర్శించుకోవడం ఇక్కడి ప్రత్యేకత. తమిళనాడు రాష్ట్రం చెన్నైకు చెందిన శ్రీ మూక్కురు పీఠం వారు లక్ష్మీనరసింహ చారియర్ ట్రస్టు స్థాపించి మట్టపల్లి క్షేత్రం గురించి విశేష ప్రచారం చేస్తున్నారు.

విద్యుత్‌దీపాలతో సుందరంగా..

మట్టపల్లి లక్ష్మీనరసింహుని క్షేత్రంలో ఈనెల 10 నుంచి 15 వరకు వైశాఖ శుద్ధ త్రయోదశిలో స్వామి వారి కల్యాణోత్సవాలను కన్నుల పండువగా నిర్వహించేందుకు దేవస్థానం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆలయాన్ని వివిధ రకాల విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. వేసవి దృష్ట్యా కల్యాణోత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ ప్రాంగణంలో చాలువ పందిళ్ల ఏర్పాటు చేశారు. స్వామివారి జాతరకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా చెన్నై, తమిళనాడు, కర్ణాటక, తదితర రాష్ట్రాల నుంచి భక్తులు వస్తున్నదున వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా నీడ, తాగునీటి, వసతి ఏర్పాట్లు చేశారు. క్షేత్రంలోని అన్ని కులాల వారు అన్నదానానికి ఏర్పాటు చేసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏపీ రాష్ట్రంలోని పిడుగురాళ్ల, మాచర్ల, తెలంగాణ నుంచి కోదాడ, మిర్యాలగూడ నుంచి ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులను నడపనున్నారు.

ఉత్సవాల్లో కార్యక్రమాలు...

మట్టపల్లి మహోక్షేత్రంలో ఈనెల 10న బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. ఈ సందర్భంగా విష్వక్సేన పూజ, రక్షాబంధనం, అఖండ దీపారాధన, అంకురారోహణం, ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్ఠాపన, 11న సుప్రభాతం, ప్రాత:కాలార్చనలు, పంచామృత అభిషేకాలు, ద్రవిడ ప్రబంధ సేవాకాలం, మల్లికాపుష్ప సహస్ర నామార్చన, లక్ష మల్లికా పుష్ప పూజ, ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఎదుర్కోలు మహోత్సవం, సాయంత్రం నాలుగు గంటలకు నాదస్వర కచేరి, ఆరు గంటలకు ముడుంబై శ్రీనివాసాచార్యులు, శ్రీమతి రాఘవలక్ష్మి మనోహర్ వారిచే భక్తి సంగీతం, సంకీర్తన, 9 గంటలకు గుంటూరు వారిచే భక్తప్రహ్లాద హరికథ, 10గంటలకు శ్రీలక్ష్మీనృసింహ నామ సంకీర్తన, రాత్రి 11:30లకు శ్రీలక్ష్మీ నరసింహస్వామి రాజ్యలక్ష్మీ సమేత చెంచులక్ష్మీ అమ్మవార్లకు ఎదుర్కోళ్లు, 12గంటలకు స్వామివారికి తిరుకల్యాణమహోత్సవం (తలంబ్రాలు) కార్యక్రమం వైభవంగా నిర్వహించనున్నారు. 12న స్వామివారికి గరుడ వాహన సేవ, 13న హంస వాహన ఉత్సవం, 14న వసంత సేవ (ప్లవోత్సవం) చక్రతీర్థం, అష్టహోమం, పూర్ణాహుతి, 15న ద్వాదశ సేవలు, శృంగార డోలోత్సవం, పవళింపు సేవతో ఈ ఉత్సవాలు ముగిస్తాయని ఆలయ ధర్మకర్త చెన్నూరి మట్టపల్లి, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్‌లు గురువారం తెలిపారు. ఈ కల్యాణ మహోత్సవ కార్యక్రమాలు బొర్రా వెంకట వాసుదేవాచార్యులు, పరాశరం వెంకటాచార్యులు, నారాయణం హరికిరణాచార్యుల ఆధ్వర్యంలో జరుగుతాయని వారు తెలిపారు.

అధ్యయనోత్సవాలకు శ్రీకారం



దివ్యప్రబంధ పఠనంతో ప్రారంభిస్తున్న స్థానాచార్యులు

మఠంపల్లి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండు రోజులు పాటు నిర్వహించనున్న అధ్యయనోత్సవాలకు గురువారం రాత్రి శ్రీకారం చుట్టారు. ఆగమశాస్త్రానుసారం జరిగిన ఈ క్రతువులో నిత్యవిధి కైంకర్యాలను చేపట్టారు. పరమ భక్తాగ్రేసురులైన నమ్మాళ్వారులకు తిరుమంజనం, సేవోత్సవం నిర్వహించారు.. ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించి అలంకార సేవలు చేపట్టారు. అనంతరం రుత్వీకులు దివ్య ప్రబంధ వేదపఠనం జరిపారు. తదుపరి మంగళ వాయిద్యాలతో నేత్రపర్వంగా పల్లకిసేవ జరిగింది. భగవద్రామానుజాచార్యులు అవతరణ ఘట్టాలను భక్తులకు వినిపించారు. పరమపదోత్సవం, శాత్తుమరై తదితర పర్వాలతో రేపటి వరకు అధ్యయనోత్సవాలు కొనసాగనున్నాయి. కార్యక్రమాల్లో ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లి, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, స్థానాచార్యులు కె.బదరీనారాయణాచార్యులు, కె.నరసింహాచార్యులు, పద్మనాభాచార్యులు అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ జట్టుకు శ్రీజ ఎంపిక



శ్రీజ

శాలిగౌరారం, మే 8(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం వల్లాల మోడల్ స్కూల్‌కు చెందిన కొప్పుల శ్రీజ జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ జట్టుకు ఎంపికైంది. ఆసిఫాబాద్ జిల్లాలోని మందమర్రిలో నిర్వహించిన 54వ సీనియర్ మహిళల రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో శ్రీజ పాల్గొని తన ప్రతిభ చాటుకుంది. దీంతో ఆమె జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందని ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ తెలిపారు. ఈ నెల 7 నుంచి 12వ తేదీన వరకు తమిళనాడులోని తిరువన్నాయిలో జరిగే నేషనల్ సీనియర్ మహిళల హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొననుంది. శ్రీజను, పీడీ మల్లేష్‌ను వల్లాల ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, ఉపాధ్యాయుల బృందం అభినందించింది.

కబడ్డీ పోటీల్లో పాల్గొననున్న ప్రణవి



ప్రణవి

తిరుమలగిరి(సాగర్), మే 8(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా తిరు మలగిరి (సాగర్) మండలం అల్వాల గ్రామానికి చెందిన తక్కెళ్లపల్లి ప్రణవి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. గ్రామానికి చెందిన కార్తీక్, విజయకుమారి కుమార్తె ప్రణవి ప్రస్తుతం మహబూబాబాద్‌లో బీ.ఫార్మసీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ప్రణవి కొంతకాలంగా కళాశాల స్థాయిలో కబడ్డీ పోటీల్లో చక్కని ప్రతిభ కనబరుస్తోంది. దీంతో మహారాష్ట్రలోని విదర్భాలో నిర్వహిస్తున్న జూనియర్ జాతీయ మహిళ విభాగ కబడ్డీ పోటీలకు ఎంపికైంది. గురువారం ఆ కళాశాలకు చెందిన ప్రిన్సిపాల్ డాక్టర్ స్వప్నరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ జి.సునీత, అధ్యాపకులు ఆమెను అభినందించారు.

ఆలేరులో పౌరసరఫరాల గోదాంలో బియ్యం గోల్‌మాల్ ..

- విజిలెన్స్ కమిటీని వేసిన ఉన్నతాధికారులు

ఆలేరు, మే 8(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని పౌరసరఫరాల గోదాంలో పెద్ద ఎత్తున బియ్యం నిల్వలు గోల్‌మాల్ అయ్యాయి. గతంలో ఇక్కడ గోదాం ఇన్‌చార్జిగా పని చేసిన అచ్చయ్యతో పాటు మరి కొందరు ఉద్యోగుల పాత్ర పై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఉన్నతాధికారులు విజిలెన్స్ కమిటీని నియమించారు. ఇక్కడ గతంలో విధులు నిర్వహించిన అచ్చయ్య ప్రస్తుతం చౌటుప్పల్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఆయన స్థానంలో రామన్నపేటలో విధులు నిర్వహిస్తున్న కుసుమ గోదాం ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకోవడం సుమారు 180 క్వింటాళ్ల బియ్యం తక్కువగా ఉండడంతో అవినీతి ఘటన వెలుగు చూసింది. ఈ విషయమై ఉన్నతాధికారులు ఆంజనేయులు, రాములు, సోమేశ్‌తో కూడిన విజిలెన్స్ కమిటీని నియమించారు. వీరు త్వరలోనే విచారణ చేపట్టి ఎంత అవినీతి జరిగిందనేది తేల్చాల్సి ఉంది.

కాంట్రాక్టు పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

నల్లగొండరూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పారిశ్రామిక సంస్థలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన జిల్లా మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ వి.కోటేశ్వర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 10వ తేదీన ముగియనున్నట్లు తెలిపారు.

లక్ష్మీనారసింహుడికి లక్ష పుష్పార్చన



గర్భాలయంలో లక్ష పుష్పార్చన సమర్పిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట, మే 8 (ఆంధ్యజ్యోతి) : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో గురువారం ఏకాదశి పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ప్రధానాలయ ముఖమండపంలో ఉత్సవమూర్తులను వివిధ పుష్పమాలికలు, పట్టువస్త్రాలు, బంగారు, వైజ్రవైడూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ సహస్రనామ పఠ నాలు, వివిధ రకాల పుష్పాలతో లక్ష పుష్పార్చన చేపట్టారు. పాంచరాత్రాగమన రీతిలో గంటపాటు పూజ పర్వం కొనసాగింది.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

స్వామివారి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య కైంకర్యాలు పాంచారాత్రగమశాస్త్ర రీతిలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 19,04,668 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు.

ఏపీ నుంచి వస్తున్న ధాన్యం లారీల పట్టివేత

- రూ.9.60 లక్షల విలువైన ధాన్యం సీజ్



సీజ్ చేసిన ధాన్యం లారీలు

మేళ్లచెర్వు, మే 8(ఆంధ్రజ్యోతి): సన్నరకం ధాన్యానికి తెలంగాణలో మద్దతు ధరతో పాటుగా బోనస్ కూడా వస్తున్నందున కొందరు అక్రమార్కులు ఏపీ నుంచి తక్కువ ధరకు సన్న ధాన్యాన్ని కొనుగోలు చేసి వివిధ మార్గాల నుంచి బోర్డర్ దాటించి రాష్ట్రంలోకి పంపుతున్నారు. సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం దొండపాడులోని చెక్‌పోస్టు వద్ద గురువారం ఉదయం ఏపీలోని జగ్గయ్యపేట నుంచి మిర్యాలగూడలోని సాయిరమణ రైస్ ఇండస్ట్రీకి ఒక లారీ వెళ్తుండా, మరో లారీ జగ్గయ్యపేట నుంచి హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లోని లక్ష్మీ ఇండస్ట్రీస్‌కు పంపుతున్నారు. ఒక్కొక్క లారీలో 70కిలోల ధాన్యం బస్తాలు 300 చొప్పున అక్రమంగా సరఫరా చేస్తుండగా చెక్‌పోస్టులో విధులు నిర్వహిస్తున్న రెవిన్యూ సిబ్బంది పోలీసులు కలిసి పట్టుకున్నారు. ఈ లారీలను దొండపాడులోని రైస్‌మిల్లులో ఉంచారు. సీజ్ చేసిన ధాన్యం విలువ రూ.9.60 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు, పోలీసు సిబ్బంది శంకర్, సైదారావు పాల్గొన్నారు. పోలీసు సిబ్బందిని సీఐ రజితారెడ్డి అభినందించారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

బీబీనగర్, మే 8(ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య సమస్యలతో చెరువులో దూకి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలో గురువారం జరిగింది. సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బీబీనగర్ చెందిన సుక్క వెంకటేశ్ (50)స్థానికంగా ఉన్న సీఎం ల్యాబోరేటరీ కంపెనీలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. కొద్ది రోజులుగా అధిక బీపీ, ఇతర ఆరోగ్య సమస్యలతో మానసికంగా బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన గురువారం తెల్లవారు జామున ఇంట్లో ఎవ్వరికి చెప్పకుండా బయటకు వెళ్లి పెద్దచెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం స్థానికులు చెరువు కట్టపై వాకింగ్ చేస్తుండగా నీళ్లలో తేలుతున్న మృతదేహాన్ని చూసి స్థానికులు సుక్క వెంకటేశ్‌గా గుర్తించి కుటుంబ సభ్యులకు, పోలీ సులకు సమాచారం అందించారు. దాంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి ఆత్మహత్యకు గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


ట్రాక్టర్ పంకా తగిలి మహిళకు తీవ్ర గాయాలు

తుంగతుర్తి, మే 8 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం కొత్తగూడెం గ్రామంలో గురువారం ట్రాక్టర్ పంకా తగిలి తీవ్రగాయాలయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఉప్పుల విజయ తమ వరి ధాన్యాన్ని కొత్తగూడెం ఐకేపీ కేంద్రంలో పోశారు. ధాన్యాన్ని తూర్పార పడితేనే కొనుగోలు చేస్తామని నిర్వాహకులు, మిల్లర్లు చెప్పడంతో ప్రతీ రైతు తమ ధాన్యాన్ని తూర్పార పడుతున్నారు. ఈ క్రమంలో విజయ తమ ధాన్యాన్ని గురువారం తూర్పార పడుతుండగా చివరి నిమిషంలో ధాన్యం పోసి పైనుంచి కిందకు దిగుతున్న క్రమంలో ట్రాక్టర్ పంకా చేయికి తగిలింది దీంతో ఆమె చెయ్యి కండరం పూర్తిగా కట్ అయింది. ఆమె చేయి నుంచి రక్తం కారుతుండటంతో అది చూసిన ఆమె భర్త నవీన్ స్పృహ తప్పిపోయాడు. ఆమెను వెంటనే తుంగతుర్తి ఆస్పత్రికి అంబులెన్స్ ద్వారా తరలించారు. అక్కడి నుంచి సూర్యాపేట ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యుల సూచన మేరకు ఆమెను హైదరాబాద్ యశోద ఆసుపత్రికి తరలించారు.

రైస్‌మిల్లుపై దౌర్జన్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు
- రైస్‌మిల్లర్ కొర్లకుంట వెంకటేశ్వరరావు ఆరోపణ





రైస్‌మిల్లు ఎదుట రాళ్లను పగులకొట్టిన దృశ్యం

హుజూర్‌నగర్, మే 8 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని లింగగిరి రోడ్డులోని తన రైస్‌మిల్లుపై దౌర్జన్యం చేసి బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని రైస్ మిల్లర్ కొర్లకుంట వెంకటేశ్వరరావు కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. 1999లో లింగగిరి రోడ్డులోని 1398/అ/2లో మూడు ఎకరాలను కేఎల్ఎన్ రావు కుటుంబ సభ్యుల నుంచి కొనుగోలు చేసి ఆ స్థలంలో రైస్ మిల్లును నిర్మించినట్లు తెలిపారు. 2014లో రైస్‌మిల్లుకు తాళం వేసి మిల్లు ఆవరణలోని రెండు ఎకరాలను వినోద్ అనే వ్యక్తికి కౌలుకు ఇచ్చినట్లు తెలిపారు. గత నెల 12వ తేదీన వసంత్‌కుమార్ అనే వ్యక్తి వచ్చి తన నుదూషించి వరిని కోయకుండా అడ్డుకున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై గత నెల 17న పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. గత నెల 22న ఎస్పీని కలవగా, చర్యలు తీసుకోవాలని సీఐ, ఎస్ఐలను ఆదేశించారని, అయినా పోలీసులు నేటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆయన ఆరోపించారు. ఈ విషయమై తను రాజీపడినట్లు గత నెల 29న ఎస్ఐ ముత్తయ్య పేర్కొని కేసును పక్కదారి పట్టించేందుకు యత్నించారని ఆరోపించారు. గత నెల 30న మిల్లు ప్రదేశంలోని పంట పొలాన్ని, మిల్లు చుట్టూ ఉన్న ఫెన్సింగ్ కడీలను కొందరు ధ్వంసం చేశారని తెలిపారు.ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి చర్య లు తీసుకోలేదని అన్నారు. ఈ ఘటనపై ఈ నెల 4న ఎస్ఐని కలవగా ఘటనా స్థలాన్ని ఆయన పరిశీలించారని, అదేరోజు రాత్రివసంత్‌కుమార్, ఆయన అనుచరులు మళ్లీ వచ్చి రైస్ మిల్లు తాళాలు ధ్వంసం చేసి, కొత్త తాళాలు వేసి ఈ మిల్లు అమ్మడానికి వీల్లేదని, మిర్యాలగూడకు చెందిన గుర్రం వెంకటేశ్వర్లు అమ్మడం జరిగిందని మిల్లు గోడలు, మిల్లు ముఖద్వారానికి పెయింటింగ్ రాశారని తెలిపారు. తన మిల్లులో ఏ వస్తువులు ఉన్నాయో? ఏమి పోయాయో కూడా తనకు తెలియదని అన్నారు. నిందితులను కేసు నమోదు చేయాలని ఎస్పీ ఆదేశించినా ఎస్ఐ ముత్తయ్య తనపై దౌర్జన్యం చేసి బెదిరింపులకు పాల్పడుతూ పట్టించుకోవడం లేదని, ఎదుటి వ్యక్తులతో సెటిల్‌మెంట్ చేసుకోవాలని ఎస్ఐ సలహా ఇస్తున్నారని తెలిపారు.

ఈ విషయంపై ఎస్ఐ ముత్తయ్యను వివరణ కోరగా, ఇది సివిల్ విషయమని ఆయన పేర్కొన్నారు. సీఐతో మాట్లాడి ప్రొసీజర్ ఫాలో అవుతామన్నారు. ఉన్నతాధికారుల సూచనలు పాటిస్తామని, తాను కూర్చొని మాట్లాడుకోమని చెప్పలేదని సివిల్ విషయాల్లో తాము జోక్యం చేసుకోబోమని అన్నారు. డాక్యుమెంట్స్ తీసుకుని రావాలని ఆదేశించినట్లు ఎస్ఐ తెలిపారు.



ఆంగ్లం జిల్లా రిసోర్స్ పర్సన్‌గా సత్యనారాయణ

శాలిగౌరారం, మే 8(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం వల్లాల మోడల్ స్కూల్‌లో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న చిత్తలూరి సత్యనారాయణ ఆంగ్లంలో జిల్లా రిసోర్స్ పర్సన్‌గా ఎంపికయ్యారు. జిల్లాలోని ఉపాధ్యాయులకు ఆయన శిక్షణ ఇవ్వనున్నారు. సత్యనారాయణ ఎంపిక కావడం ఎంతో గర్వకారణమని మండలంలోని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

శాలిగౌరారం, మే 8(ఆంధ్రజ్యోతి): ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి అన్నారు. మండలకేంద్రంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో బైరవునిబండ గ్రామానికి చెందిన శేఖర్‌కు మంజూరైన రూ.31వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును వారు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నరిగె నరసింహ, బోడ అరుణ్, గోపినాథ్, సైదులు, యాదయ్య, భద్రయ్య, అంజయ్య పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలి



జెండాను ఎగరవేస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున

నల్లగొండ రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలని, దానికి కార్మికులంతా ఏకం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున పిలుపు నిచ్చారు. మేడే ఉత్సవాలను పురష్కరించుకొని గురువారం మండలంలోని జికే అన్నారంలో ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి కార్మిక చట్టాలను కాలరాసిందన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలుచేయడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా, కార్మిక విధానాలపై పోరాడాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొండ అనురాధ, నాయకులు నలుపరాజు సైదులు, కొండ వెంకన్న, శంకర్, రాములు, సైదమ్మ, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులను సద్వినియోగం చేసుకోవాలి

శాలిగౌరారం, మే 8(ఆంధ్రజ్యోతి): నకిరేకల్ నుంచి శాలిగౌరారం మీదుగా మనిమద్దె గ్రామం వరకు రెండు ట్రిపులు, ఉప్పల్ ఎక్స్‌రోడ్డు వరకు వేసిన ఒక ట్రిప్పు బస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నల్లగొండ ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనాథ్ తెలిపారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండ డిపోకు చెందిన బస్సు ప్రతీ రోజు నకిరేకల్ నుంచి శాలిగౌరారం మీదుగా ఉదయం 7 గంటలు, సాయంత్రం 5 గంటలకు మనిమద్దె వరకు నడుపుతున్నట్లు తెలిపారు. నకిరేకల్ నుంచి శాలిగౌరారం, గురజాల, అమ్మనబోలు, మోత్కూరు, భువనగిరి మీదుగా ఉప్పల్ ఎక్స్‌రోడ్డు వరకు ఉదయం 9.30, తిరిగి ఉప్పల్ ఎక్స్‌రోడ్డు నుంచి మధ్యాహ్నం 1.15 గంటలకు బయలుదేరి ఇదే రూట్‌లో నకిరేకల్‌కు చేరుకుంటుందని వివరించారు. ఈ బస్సు సౌకర్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎం శ్రీనాథ్ తెలిపారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

నార్కట్‌పల్లి, మే 8(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండల కేంద్రంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు ఆసరా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు మేడి హరికృష్ణ ఆధ్వర్యంలో గురువారం మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో దైద నాగరాజు, పోలే రాజు, గోపాల్, ఎఫ్ఏ అండాలు తదితరులు పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలను అడ్డుకున్న అధికారులు

- తవ్వకాలకు వాడిన వాహనాలు పోలీస్‌స్టేషన్‌కు తరలింపు



మట్టి తరలించిన ప్రదేశాన్ని పరిశీలించిన ఐబీ శాఖ డీఈ కాత్యాయిని

తిప్పర్తి, మే 8 (ఆంధ్రజ్యోతి): మట్టిని అక్రమంగా తరలిస్తున్న వారిని సంబంధిత శాఖ అధికారులు అడ్డుకొని పనులు నిలిపివేశారు. 'చెరువులను తవ్వేస్తున్నారు' అనే శీర్షికతో గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా స్థాయి అధికారులు ఐబీ శాఖ డీఈ కాత్యాయిని, ఏఈ శివరామ్‌తో కలిసి మట్టి తరలించిన ప్రదేశాన్ని పరిశీలించారు. అధిక లోతులో తీసినట్లు గుర్తించారు. అదే విధంగా తవ్విన మట్టిని రైతులు పొలాల్లో పోశారా లేదా ఇతర వ్యాపారాలకు ఉపయోగించారా అనే అంశంపై విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా గురువారం మట్టి తరలిస్తున్న ప్రదేశంలోని ఒక ఎక్స్‌కవేటర్, మూడు టిప్పర్లను తిప్పర్తి ఎస్ఐ బి. సాయిప్రశాంత్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సంబంధిత శాఖ నుంచి మట్టి తవ్వకానికి అనుమతి తీసుకోవాలని సూచించారు. అంతేకాక తీసిన మట్టిని ఎక్కడ పోశారనే అంశంపై విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.

శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



వేసవి శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఎంఈవో సైదానాయక్

చిట్యాలరూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): వేసవికాలం సెలవుల్లో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నిర్వహించే వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చిట్యాల ఎంఈవో పి.సైదానాయక్ సూచించారు. చిట్యాల మండలం చిన్నకాపర్తి జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని గురువారం ఆయన పరిశీలించారు. విద్యార్థులకు బోధిస్తున్న అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ శిక్షణ శిబిరంలో పాఠ్యాంశేతర అంశాలు, పాఠాలుంటాయని, అంతేకాక వండర్ గేమ్స్, కంప్యూటర్ విద్య, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్‌తో పాటుగా ఆటపాట కార్యక్రమాలు ఉంటాయని సూచించారు. వేసవి కాలంలో విద్యార్థులు ఎండకు తిరగకుండా నీడన ఉంటూ చల్లటి వాతావరణంలో పాఠ్యాంశేతర అంశాలను అలవరచుకోలన్నారు. విద్యార్థులందరికీ ఉపయోగపడే ముఖ్యమైన డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లీష్‌పై దృష్టి సారించాలన్నారు. అనంతరం విద్యార్థులకు ఆయన అరటి పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శిబిరం ఇన్‌చార్జి ఉపాధ్యాయులు చంద్రశేఖర్, నవ్య పాల్గొన్నారు.

మూడు టిప్పర్ల పట్టివేత: కేసు నమోదు

కనగల్, మే 8 (ఆంధ్రజ్యోతి): కనగల్ మండలంలోని పెద్దగుట్ట నుంచి అనుమతి లేకుండా రాత్రి సమయంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న మూడు టిప్పర్లను కనగల్ పోలీసులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పర్వతగిరి గ్రామానికి చెందిన శ్రీశైలం అనే వ్యక్తి రెవెన్యూ, మైనింగ్ శాఖల నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకుండా పెద్దగుట్ట నుంచి టిప్పర్ల ద్వారా బుధవారం రాత్రి మట్టిని తరలిస్తున్నాడు. వాహన తనిఖీలో భాగంగా సదరు వాహనాలను పట్టుకుని సీజ్ చేసినట్టు ఎస్ఐ వివరించారు. శ్రీశైలంతో పాటు టిప్పర్ డ్రైవర్లపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూములు, గుట్టల నుంచి అనుమతులు లేకుండా మట్టిని అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాయని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చిట్యాలరూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో గురువారం జరిగింది. వాహనదారులు తెలిపిన వివరాల ప్రకారం... భద్రాచలం జిల్లా చింత్రియాల నుంచి తండ్రీ కొడుకులైన లంక నాగేశ్వరరావు, రామకృష్ణ హైదరాబాద్‌కు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. మార్గమధ్యలో పెద్దకాపర్తి శివారులోకి చేరుకోగానే గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. రోడ్డు పక్కన చెట్లలోకి దూసుకెళ్లడంతో అక్కడే పడిపోయారు. చికిత్స నిమిత్తం వారిని నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని చిట్యాల పోలీసులు తెలిపారు. రోడ్డు ప్రమాదం జరగడంతో బాధితులను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు రవీందర్ ఆసుపత్రికి తరలించి మానవత్వాన్ని చాటుకున్నారు. ప్రమాదాన్ని గమనించిన ఆయన కారును ఆపి ఘటనా స్థలానికి వెళ్లారు. గాయపడిన వారికి ధైర్యం చెప్పి అంబులెన్స్‌లో నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆట వస్తువులకు భలే గిరాకీ

- ఇండోర్ గేమ్స్‌కు పెరుగుతున్న ఆదరణ
- వేసవి సెలవుల్లో చిన్నారుల ఆహ్లాదం
- పెరుగుతున్న క్రీడా సామగ్రి కొనుగోళ్లు

నల్లగొండ, స్పోర్ట్స్ మే 8 (ఆంధ్రజ్యోతి): సెలవుల్లో చిన్నారులు ఆట పాటలతో గడపాలని కోరుకుంటున్నారు. ట్యూషన్లు, హోంవర్క్‌లతో కష్టపడి చదువుకున్న చిన్నారులకు వేసవి సెలవులు ఎంతో ఆనందాన్ని తెచ్చి పెట్టాయి. రోజంతా ఆటలతో కాలం గడుపుతున్నారు. దాంతో ఆట వస్తువులకు భలే గిరాకీ ఉంది. ఉష్ణోగ్రత తీవ్రత రోజుకు ఎక్కువగా ఉన్నందున ఇండోర్ గేమ్స్‌పై చిన్నారులు మక్కువచూపుతున్నారు. ఇండోర్ గేమ్స్, క్యారం, చెస్, బిల్డింగ్ రాక్స్, ట్రైన్ సెట్లతో పాటు స్విమ్మింగ్‌ను ఎక్కువగా ఇష్టపడుతున్నారు. దీంతో సిమ్మింగ్ డ్రస్‌లకు కూడా గిరాకీ ఎక్కువగా ఉంది. అంతేకాకుండా ప్రతీ ఒక్కరూ ఇష్టపడే క్రికెట్, ఫుట్‌బాల్‌ను కూడా ఆడుతున్నారు.





క్యారం బోర్డు ఆడుతున్న చిన్నారులు, (ఇన్‌సెట్‌లో) అమ్మకానికి సిద్దంగా క్రీడా సామగ్రి

వీడియో గేమ్స్

చిన్నారులు ఎక్కువగా వీడియో గేమ్సను ఇష్టపడుతున్నారు. దాంతో ఇండోర్ గేమ్స్‌లలో ఎక్కువ ఆట వస్తువులు వీడియో గేమ్స్ అమ్ముడు పోతున్నాయి. వీటి ధర రూ. 40 నుంచి 600 రూపాయల వరకు ఉంది.

క్రికెట్

ఈ ఆటను చిన్నారులతో, పాటు పెద్దలు కూడా ఇష్టపడుతున్నారు. వేసవిలో ఎండ వేడిమి ఎంత ఉన్న క్రికెట్‌కు సంబంధించిన బ్యాట్, బాల్స్ కొనుగోలు చేస్తున్నారు. పెద్దవారికి, చిన్న వారికి సంబంధించిన క్రికెట్ బ్యాట్ బాల్స్ రూ. 200 వరకు కొనుగోలు చేస్తున్నారు.

స్విమ్మింగ్ డ్రెస్

నల్లగొండ పట్టణ నడిబొడ్డులో ఇటీవల ప్రారంభమైన స్విమ్మింగ్ పూల్‌లో చిన్నారులు ఎంతో ఆహ్లాదకరంగా స్విమ్మింగ్ చేస్తున్నారు. దీంతో స్విమ్మింగ్ డ్రెస్‌లకు గిరాకీ పెరిగింది. రూ. 300 నుంచి 350 వరకు స్విమ్మింగ్ డ్రెస్, రూ. 60 క్యాపు, కళ్లద్దాలు రూ. 50 విక్రయిస్తున్నారు.

క్యారం, చెస్

ఇండోర్ గేమ్స్‌లో ఎక్కువ మంది నేర్చుకోవాలని కుతూహల పడేది క్యారమ్స్, చెస్. క్యారంబోర్డులు రూ. 200 నుంచి రూ. 400 ధరకు ఎక్కువ మంది కొనుగోలు చేస్తున్నారు.

బిల్డింగ్ రాక్స్, ట్రైన్ సెట్

ఎల్‌కేజీ, యూకేజీ స్థాయి విద్యార్థులకు ఇంట్లో ఉండి ఆటలాడుకోవడానికి తల్లిదండ్రులు ఇష్టపడతారు. బిల్డింగ్ రాక్స్, ట్రైన్ సెట్, రిమోట్ కార్లను కొనుగోలు చేస్తున్నారు.

వీటి ధ ర రూ. 150 నుంచి 500 వరకు బిల్డిం గ్ రాక్స్ ట్రైన్ సెట్ రూ. 400 నుంచి 450, రిమోట్ కార్లు రూ. 100 నుంచి రూ.500 వరకు లభ్యమవుతున్నాయి.

క్రికెట్ అంటే చాలా ఇష్టం



క్రికెట్ ఆట అంటే నాకు చాలా ఇష్టం. సెలవులు బాగా ఆడుకుంటున్నాను. టైంపాస్ కోసం రిమోట్ కారును కొనుగోలు చేశా.

● యశ్వంత్, 4వ తరగతి, నల్లగొండ

వీడియో గేమ్స్ ఆడుతున్నా



వేసవి సెలవులు వీడియో గేమ్స్ ఆడుకుంటున్నాను. వీడియో గేమ్స్ అంటే నాకు చాలా ఇష్టం. ప్రతీరోజు నేను వీడియో గేమ్స్ ఆడుకుంటున్నాను.

● కార్తీక్, నల్లగొండ

సెలవుల్లో గిరాకీ పెరిగింది



వేసవిలో ఆట వస్తువులకు గిరాకి పెరిగింది. ఎక్కువమంది స్విమ్మింగ్ పూల్ డ్రస్సులు వీడియో గేమ్స్ ను ఎక్కువగా విక్రయిస్తున్నారని హనుమాన్ స్పోర్ట్స్ యజమాని సత్తయ్య గౌడ్ పేర్కొన్నారు.

- సత్తయ్యగౌడ్, హనుమాన్ స్పోర్ట్స్ షాప్ యజమాని

నెమ్మానిలో వైభవంగా మారెమ్మ పండుగ

- తెల్లవారుజామున అమ్మవారి కల్యాణం
- అలరించిన ఎడ్లబండ్ల ఫలహార ప్రదర్శన
- హాజరైన ఎంపీ చామల, ఎమ్మెల్యే వేముల



ఉత్సవంలో పాల్గొని పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నార్కట్‌పల్లి, మే 8(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని నెమ్మానిలో గ్రామ దేవత మారెమ్మ ఉత్సవాలు అత్యంత భ క్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ నెల 6వ తేదీన ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారి కల్యాణోత్సవం, ఎడ్లబండ్ల ఫలహార ప్రదర్శన వైభవంగా నిర్వహించారు. పండుగ నేపథ్యంలో ప్రతీ ఇంటా ఆడపడుచులు, బంధువుల సందడి నెలకొంది. ఉత్సవాల మొదటి రోజు మారెమ్మ అమ్మవారిని ప్రస్తుతం ఉన్న ఆలయం నుంచి డప్పుచప్పుళ్ల మధ్య మేళ్లకుంటకు వెళ్లేదారిలో ఉన్న దేవత తల్లివారింటికి చేరుస్తారు. మూడు రోజులు అక్కడ నిద్ర చేసిన మారెమ్మ అమ్మవారిని గురువారం తెల్లవారుజామున అదే సంప్రదాయాలతో తిరిగి ఆలయానికి చేర్చారు. సంప్రదాయ పద్ధతుల్లో కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం వేళ ఎడ్లబండ్లతో ఫలహార ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ఈ వేడుకకు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్‌లు హాజరై ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, అలుగుబెల్లి సోదరులు ప్రభాకర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, మాజీ సర్పంచులు కేమ పరమేశం, గంట్ల నర్సిరెడ్డి, అలుగుబెల్లి వసంతవెంకట్‌రెడ్డి, బత్తుల ఊశయ్య, సాగర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, ఎల్లేశ్, వెంకట్‌రెడ్డి, వివేక్‌రెడ్డి, రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయం

- ఎంపీ చామల, ఎమ్మెల్యే సామేలు



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న భువనగిరి ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేలు, ఆర్ఎం జాన్‌రెడ్డి

శాలిగౌరారం, మే 8 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, గ్రామీణ ప్రాంతాల్లో బస్సులు ఎక్కడ నడిపించాలో అధికారులు సర్వే చేసి తక్షణమే బస్సులు నడిపించాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మోత్కూరు నుంచి ఉప్పల్ ఎక్స్‌రోడ్డు వరకు వెళ్లే బస్సును గురువారం శాలిగౌరారంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద వారు ప్రారంభించారు. అనంతరం వారు బస్సు ఎక్కి టికెట్ తీసుకుని శాలిగౌరారం మండల కేంద్రంలో తిరిగారు. ఈ సందర్భంగా ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే సామేలు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

రాష్ట్రంలో అన్ని డిపార్ట్‌మెంట్ల కంటే ఎక్కువగా ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు క్రమశిక్షణతో పాటు తక్కువ వేతనానికి పనిచేస్తున్నారని అన్నారు. కార్మికుల, ఉద్యోగుల కృషిని ప్రభుత్వం త్వరలో గుర్తిస్తుందన్నారు. ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థను అర్థం చేసుకొని కార్మికులు సమ్మెకు వెళ్లకుండా విరమించినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. శాలిగౌరారం మండల నుంచి ఇతర ప్రాంతాలకు బస్సులు నడిపించాలని ఆర్ఎంను కోరారు. కార్యక్రమంలో నల్లగొండ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ కొణతం జాన్‌రెడ్డి, నల్లగొండ డిపో మేనేజర్ శ్రీనాథ్, డిపో ఏడీసీ శౌరయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్ రెడ్డి, వైస్ చైర్మన్ నరిగే నర్సింహ, కాంగ్రెస్ పార్టీ నాయకులు నూక కిరణ్ కుమార్‌యాదవ్, కందాల సమరంరెడ్డి, సుధాకర్, మ హేందర్ రెడ్డి, జయపాల్‌రెడ్డి, చింత ధనుంజయ్, పరమేష్, షేక్ ఇంతియాజ్ అహ్మద్, జనార్ధన్, వేణుగోపాల్‌రెడ్డి, దేవేందర్, వెంకటయ్య, గోపినాథ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖకు
బకాయిల గుదిబండ

(5వ పేజీ తరువాయి)

రూ.95లక్షల వరకు విద్యుత్ బిల్లులు వస్తుంటే, సుమారుగా రూ.2.30లక్షల వరకు చెల్లిస్తుండగా, మిగిలిన బిల్లు పెండింగ్‌లో ఉంటోంది. గ్రామపంచాయతీలకు నెలనెలా సుమారు రూ.3.61 కోట్ల వరకు బిల్లులు వస్తుంటే, అందులో కేవలం రూ.4.16లక్షల వరకే చెల్లింపులు ఉంటుండగా, మిగిలిన బిల్లులు పెండింగ్‌లో ఉంటున్నాయి. అందుకే గ్రామపంచాయతీల పెండింగ్ బిల్లులే జిల్లాలో అత్యధికంగా రూ. 100 కోట్లను దాటిందని విద్యుత్ అధికారులు పేర్కొంటున్నారు.

పోలీస్ స్టేషన్లు, క్వార్టర్ల బిల్లులూ భారీగానే....

జిల్లాలో స్థానిక సంస్థల తర్వాత పోలీస్‌స్టేషన్లు, సిబ్బంది క్వార్టర్లకు సంబంధించిన బిల్లులే అధికంగా పెండింగ్‌లో ఉన్నాయి. పోలీస్‌స్టేషన్లకు సంబంధించి ప్రతి నెలా సుమారు రూ.3.78లక్షల బిల్లు వస్తే, సుమారు రూ.25వేల వరకు చెల్లింపులుంటుండగా, మిగిలినవి పెండింగ్‌లో పడుతున్నాయి. మొత్తంగా జిల్లాలో పోలీస్‌స్టేషన్ల బిల్లులు రూ.42.31లక్షల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. అదేవిధంగా నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండలోని పోలీస్ క్వార్టర్లకు సంబంధించి విద్యుత్ బిల్లులు పెద్ద మొత్తంలో బకాయిలు ఉన్నాయి. ఇవి సుమారు రూ.1.30కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. వీటితో పాటు ఎత్తిపోతల పథకాలకు సంబంధించి సైతం జిల్లాలో పెద్ద మొత్తంలో బకాయి పేరుకుపోయింది. వీటికి సంబంధించి రూ.1.54కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. నీటిపారుదలశాఖలో ఈ పద్దు కింద నిధులు మంజూరైన వెంటనే బిల్లులు క్లియర్ చేస్తారని, ఒక్కో ఎత్తిపోతల పథకానికి సంబంధించి ఒక్కో నెల బిల్లు వస్తుంటుందని, వచ్చినవి వచ్చినట్లు చెల్లిస్తున్నా, పెండింగ్ బకాయిలు అలానే ఉంటున్నాయని విద్యుత్ అధికారులు తెలిపారు. ప్రజలకు అత్యవసర సేవలందించే వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలోని పీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల్లో పెద్ద మొత్తంలో బకాయిలు ఉన్నాయి. రెవెన్యూశాఖకు సంబంధించి సైతం సుమారు రూ.39.28లక్షల మేర బకాయిలు పేరుకుపోయాయి. మొత్తంగా జిల్లాలో 14శాఖలకు సంబంధించి సుమారు రూ.6.06కోట్ల బకాయిలు స్థిరంగా ఉంటున్నాయి. ఈ శాఖల కింద ప్రతి నెలా రూ.51.15లక్షల బిల్లులు వస్తే, చెల్లింపులు రూ.36.65 లక్షలవరకు ఉంటుండగా, మిగిలినవి పెండింగ్ పడుతున్నాయి. ఇవి పెరుగుతూ కొండలా మారిపోతున్నాయని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. బిల్లుల చెల్లింపులపై అన్ని శాఖల్లో స్థిరమైన విధానం నిర్ణయిస్తే తప్ప, ఏ నెల బిల్లు ఆ నెల క్లియర్ కాదని, ఆ దిశగా ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకుంటే బకాయిల బెడద తప్పుతుందని వారు పేర్కొంటున్నారు.

ఏకీకృత సర్వీస్ రూల్స్ రాజ్యాంగ విరుద్ధం

చిట్యాలరూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కమిటీ ఏకగ్రీవంగా ఆమోదించిన ఏకీకృత సర్వీస్ రూల్స్ రాజ్యాంగానికి విరుద్ధమని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రభుత్వ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దూదిగామ స్వామి, ప్రధానకార్యదర్శి కానాల సంపత్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో అనేక మంది ముఖ్యమంత్రులు వారి హయాంలో ఇచ్చిన జీవోలను హైకోర్టు, సుప్రీంకోర్టులు తిరస్కరించాయని పేర్కొన్నారు. ఆర్టికల్ 371డి ప్రకారం 73వ రాజ్యాంగ సవరణ పంచాయతీరాజ్ యాక్ట్ మరియు రాష్ట్రపతి ఉత్తర్వులపై కోర్టులో స్టే ఉందని, స్టే ఆర్డర్ ప్రకారం చెల్లుబాటు కాదని తెలిపారు. పంచాయతీరాజ్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు, జేఏసీలు పదేపదే ఏకీకృత సర్వీస్ రూల్స్‌పై ప్రభుత్వంపై ఒత్తిడిని తేవడాన్ని ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం వ్యతిరేకిస్తుందని పేర్కొన్నారు.

మార్కెట్‌కు అదనపు ఆదాయం

- ప్రారంభానికి సిద్ధమైన మార్కెట్ మడిగెలు
- అందుబాటులోకి రానున్న 32 షట్టర్లు

చిట్యాల, మే 8 (ఆంధ్రజ్యోతి): చిట్యాల వ్యవసాయ మార్కెట్ ఆధ్వర్యంలో మార్కెట్ ఆవరణలో భువనగిరిరోడ్డుకు నిర్మించిన 32 మడిగెలు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. సుమారు రూ.1.16 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన మడిగెలు త్వరలోనే ప్రారంభానికి నోచుకోనున్నాయి. రెండు ఫ్లోర్లలో నిర్మించిన మడిగెలు రంగులు వేశారు. అన్ని పనులు పూర్తిచేశారు. కేవలం కరెంట్ మీటర్లు బిగించాల్సి ఉంది. కరెంటు మీటర్ల కోసం రూ.5.03లక్షలు మంజూరయ్యాయి. ఈ వారంలో మీటర్లు బిగించి మడిగెలను ప్రారంభించనున్నారు. మడిగెల ప్రారంభంతో భువనగిరి రోడ్డు కొత్తకళను సంతరించుకోనుంది. దుకాణాల అద్దె తక్కువగా ఉండాలని ప్రజలు ఆశిస్తున్నారు.

మడిగెల కేటాయింపులో రిజర్వేషన్లు

మార్కెట్ ఆధ్వర్యంలో నిర్మించిన మడిగెలు దుకాణదారులకు కేటాయింపులో రిజర్వేషన్లు పాటించనున్నట్లు తెలిసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగుల వారికి రిజర్వేషన్ల ఆధారంగా మడిగెలు కేటాయించనున్నారు. రిజర్వేషన్ల ఆధారంగా మడిగెలకు ఓపెన్ యాక్షన్ నిర్వహించి ఎక్కువ పాడిన వారికి కేటాయించనున్నట్లు సమాచారం. ఈ 32 మడిగెలు ప్రారంభిస్తే మార్కెట్ కమిటీ అదనపు ఆదాయం చేకూరనుంది.



ప్రారంభానికి సిద్ధమైన చిట్యాల వ్యవసాయ మార్కెట్ ఆవరణలో నిర్మించిన మడిగెలు


మీటర్లు బిగించగానే ప్రారంభిస్తాం



మడిగెలకు విద్యుత్తు మీటర్లు బిగించగానే ప్రారంభిస్తాం. మడిగెలను రిజర్వేషన్ల ప్రకారం కేటాయిస్తాం. పనులు పూర్తయిన తర్వాత ఓపెన్‌యాక్షన్ నిర్వహించి మడిగెలు కేటాయిస్తాం.


- జానయ్య, మార్కెట్ కార్యదర్శి

త్వరగా ప్రారంభించాలి



మడిగెలను త్వరగా ప్రారంభించి అందుబాటులోకి తేవాలి. షాపు లేక తాత్కాలిక షెడ్డులో వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని మడిగెలు ప్రారంభిస్తే అందులోకి మారుతామన్నారు. దుకాణాల కిరాయి తక్కువగా ఉంచాలి.

- ఏళ్ల రాములు, చిట్యాల





హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై కట్టంగూరు వద్ద ప్రమాదభరితంగా ఉన్న జంక్షన్

ఆంధ్రజ్యోతి పరిశీలన

జాతీయ రహదారులపై కొరవడుతున్న రక్షణ చర్యలు

నిశీధిలో ప్రయాణం

ప్రాణమే పణం

ఉమ్మడి జిల్లాలో నిత్యం రద్దీగా ఉండే జాతీయ రహదారులు ఉన్నాయి. ఈ రహదారులపై రక్షణ కొరవడుతుండటంతో ప్రయాణికులకు నిత్యం ప్రాణ సంకటంగా మారింది. నిత్యం రాత్రి వేళల్లో ఏదో ఒక ప్రాంతంలో ప్రమాదాలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. ఫలితంగా ఎందరో ప్రాణాలు విడుస్తుండగా మరెందరో క్షతగాత్రలు అవుతున్నారు. జంక్షన్లు, యూటర్నుల వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడం, ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు హైమాస్ట్ లైట్లు వెలగకపోవడంతో ఇక్కడ రహదారిని దాటడం నరకప్రాయంగా మారింది. రహదారికి సమీపంగా ఉన్న గ్రామాల ప్రజలు నిత్యం పనులపై ఈ రహదారిపై ప్రయాణించేందుకు జంకుతున్నారు.

• 6లో..

- హైమాస్ట్ లైట్లు లేక యూటర్న్‌ల వద్ద చీకట్లు
- ప్రమాదాలకు కేరాఫ్‌లుగా పలు ప్రాంతాలు
- సమీప గ్రామాల ప్రజలకు ప్రయాణం నిత్యం ప్రాణసంకటమే
- విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

మంత్రి పొంగులేటి శ్రీనివా‌స్‌రెడ్డి




ఇందిరమ్మ ఇంటి నమూనా నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

నకిరేకల్, మే 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నకిరేకల్ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్మించిన ఇందిరమ్మ నమూనా ఇంటిని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్లు అంటేనే ఇందిరమ్మ రాజ్యమని, పేదలకు ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. ప్రతీ ఎన్నికల్లో ఇందిరమ్మను గుర్తుంచుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లను వచ్చే నాలుగేళ్లలో నాలుగు విడతల్లో మంజూరు చేస్తామన్నారు. గత ప్రభుత్వంలో మంత్రులు దొరవారి ఫాంహౌస్ నుంచి జనాల వద్దకు రాలేదని విమర్శించారు. జూన్ 2న రాష్ట్రంలో ప్రతీ గ్రామానికి అధికారులు వచ్చి గ్రామంలోనే ప్రజాసమస్యలను పరిష్కరిస్తారన్నారు. రైతులకు చుట్టంగా భూభారతి చట్టాన్ని రూపొందించామన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతీ నియోజకవర్గానికి రూ.200కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మిస్తున్నామన్నారు. పేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని, రూ.500 గ్యాస్ సబ్సిడీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్న బియ్యం పంపిణీ, రూ.10లక్షల వరకు ఆరోగ్యశ్రీ పెంపు వంటి సంక్షేమ పథకాలను తమ ప్రభుత్వం అమలుచేస్తోందన్నారు. కాళేశ్వరం, మిషన్ భగీరథలో గత పాలకులు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. రూ.8లక్షల కోట్లకు పైగా అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాళా తీయించారని విమర్శించారు. గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో పేదలపై కనికరం చూపలేదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు శంకర్‌నాయక్, నెల్లికంటి సత్యం, ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, మందుల సామేలు, మదర్ డెయిరీ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, పాల్గొన్నారు. అనంతరం ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.



సంఘీభావ ర్యాలీలో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ చామల, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యేలు వీరేశం, బీఎల్ఆర్



విద్యుత్‌శాఖకు బకాయిల గుదిబండ

- ప్రభుత్వరంగ సంస్థల బకాయిలు రూ.130కోట్లు
- అందులో గ్రామ పంచాయతీలవే రూ.100కోట్లు
- పాలకవర్గాలు లేకపోవడంతో పేరుకున్న బకాయిలు
- కీలకశాఖలన్నింటిలో విద్యుత్ బకాయిలు
- ప్రతీ నెల చెల్లించేలా విధానం తేవాలంటున్న విద్యుత్‌శాఖ

నల్లగొండ, మే 8 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): విద్యుత్‌శాఖకు ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు గుదిబండగా మారాయి. స్థానిక సంస్థలైన గ్రామపంచాయతీలు, మునిసిపాలిటీల్లో సైతం పెద్ద మొత్తంలో బకాయిలు పేరుకుపోయాయి. స్థానిక సంస్థల బకాయిలు అత్యధికంగా రూ.123.59కోట్లు ఉండగా, 14 రకాల ప్రభుత్వరంగ సంస్థల బకాయిలు రూ.6.06కోట్లు ఉన్నాయి. మొత్తంగా జిల్లాలో ఈ బకాయిలు సుమారు రూ.130కోట్ల మేర ఉన్నాయి. ఈ బకాయిలను దశలవారీగానైనా చెల్లించాలని హెచ్‌వోడీలకు నివేదిస్తున్నామని విద్యుత్ అధికారులు పేర్కొంటున్నారు.

జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలు, వాటి పరిధిలోని ఇతర వినియోగాల నిమిత్తం నెలనెలా వచ్చే బిల్లులకు పొంతనలేకుండా చెల్లింపులుంటున్నాయని, దీంతో ప్రతి నెలా పెండింగ్ బకాయిలు ఉంటాయని, అవి పేరుకుపోయి సంస్థకు భారంగా మారాయని విద్యుత్ అధికారులు పేర్కొంటున్నారు. ఆయా శాఖలలో సంబంధిత పద్దు కింద నిధులు విడుదలైతే తప్ప బిల్లులు చెల్లించే పరిస్థితి ఉండదు. ప్రభుత్వ కార్యాలయాలు కావడంతో నోటీసులివ్వడం తప్ప డిస్‌కనెక్ట్ చేయలేని పరిస్థితి. గృహవినియోగదారులు, వాణిజ్య, పారిశ్రామిక, ఇతర వినియోగదారులకు వర్తింపజేసినంత కఠినంగా బిల్లుల చెల్లింపునకు ఈ శాఖలపై ఒత్తిడి చేయలేని పరిస్థితి ఉంది.

పాలకవర్గాలు లేకపోవడమూ కారణం

జిల్లాలో పేరుకుపోయిన విద్యుత్ బిల్లుల బకాయిల్లో అత్యధికంగా స్థానిక సంస్థలైన పంచాయతీలు, మునిసిపాలిటీల్లో ఉన్నాయి. ప్రధానంగా పంచాయతీల్లో పెండింగ్ బిల్లులు అత్యధికంగా రూ.100కోట్లు దాటాయి. జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలు, మునిసిపాలిటీలకు సంబంధించి కార్యాలయాలు, తాగునీటి పథకాలు, వీధిదీపాల నిర్వహణకు విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుంది. దీంతో ఈ సంస్థల పద్దుల కింద కనెక్షన్లకు విద్యుత్ బిల్లులు భారీగా వస్తున్నాయి. అయితే వీటికి పాలకవర్గాలు లేకపోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన గ్రాంట్లు, కేంద్ర ఆర్థిక సంఘం నిధులు నిలిచాయి. ఫలితంగా ఈ సంస్థల విద్యుత్ బిల్లుల చెల్లింపు సామర్థ్యం తగ్గింది. గ్రామ పంచాయతీలతో పోల్చితే మునిసిపాలిటీలకు ఆస్తి, ఇంటి పన్నుల వసూళ్లతో కొంత రెవెన్యూ వస్తుండగా వాటిని అత్యవసర పనులకు వినియోగిస్తున్నారు. దీంతో విద్యుత్ బిల్లులు పెండింగ్‌లో పడిపోతున్నాయి. మునిసిపాలిటీలకు ప్రతి నెలా సగటున

మిగతా 8వ పేజీలో...

జిల్లాలో విద్యుత్ బకాయిలు ఇలా..

విభాగం	బకాయిలు (రూ.లక్షల్లో)
బీసీ వెల్ఫేర్	4,55,054
పోలీస్	42,31,039
సబ్‌జైల్	3,67,647
ఎత్తిపోతల పథకాలు	1,54,70,070
పీహెచ్‌సీలు	97,27,218
సోషల్‌వెల్ఫేర్	13,40,618
ట్రైబల్‌వెల్ఫేర్	2,12,761
రెవెన్యూ	39,28,497
ఏరియా ఆస్పత్రి	34,75,667
వెటర్నరీ	3,67,385
విద్యాశాఖ	80,46,322
పోలీస్ క్వార్టర్స్, నల్లగొండ	50,42,123
పోలీస్ క్వార్టర్స్, మిర్యాలగూడ	54,70,976
పోలీస్ క్వార్టర్స్, దేవరకొండ	25,36,790
మొత్తం	6,06,72,171
జీపీలు	100,41,08,000
మున్సిపాల్టీలు	23,18,44,000
మొత్తం	123,59,52,000
మొత్తం	129,66,24,171

● బకాయిలు చెల్లించాలని నోటీసులు ఇస్తూనే ఉన్నాం

జిల్లాలో ప్రభుత్వరంగ సంస్థల బకాయిలు సుమారు రూ.130కోట్ల వరకు ఉన్నాయి. బకాయిలు చెల్లించాలని అన్ని శాఖల ఇన్‌చార్జిలను కోరుతూనే ఉన్నాం. నోటీసులు కూడా ఇస్తున్నాం. బిల్లులు రాగానే ఆయా శాఖల నుంచి, లోకల్‌బాడీస్ నుంచి నేరుగా చెల్లిస్తూనే ఉన్నారు. అయినా పూర్తిగా బకాయిలు రావడం లేదు. ప్రతినెలా వీలైనంత ఎక్కువగా బిల్లులు వచ్చేలా ప్రయత్నం చేస్తూనే ఉన్నాం.

వెంకటేశ్వర్లు, ఎస్ఈ, నల్లగొండ

విద్యార్థులకు ఆటవిడుపుగా శిబిరాలు

ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో విద్యార్థులకు ఆటవిడుపుగా వేసవి శిక్షణ శిబిరాలు ఉపయోగపడతాయని ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ కుటుంబ సభ్యుల పిల్లలకు ఉచిత మెగా సమ్మర్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వేసవికాలంలో పోలీస్ కుటుంబాలకు చెందిన పిల్లలకు ఆటవిడుపుగా ఉండాలని, ప్రత్యేకంగా చిన్ననాటి నుంచి వ్యాయామం, ఆటలపై శిక్షణ ఇచ్చి ఉన్నత స్థానాలకు ఎదగాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ప్రారంభించామన్నారు. శిబిరంలో 100 మంది విద్యార్థులకు నెలరోజుల పాటు ఉదయం, సాయంత్రం శిక్షణ ఇస్తామన్నారు. విద్యార్థులకు యోగా, కరాటే, వాలీబాల్ లాంటి తదితర క్రీడాంశాల్లో నైపుణ్యం కలిగిన పీఈటీలు, యోగా గురువులతో ప్రత్యేక శిక్షణను అందించనున్నట్లు తెలిపారు. ఆటలు, యోగాతో విద్యార్థులకు మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం లభిస్తుందన్నారు. ప్రస్తుత సమాజంలో పిల్లలు చిన్నతనం నుంచే సెల్‌ఫోన్‌కు అలవాటు పడి ఆటలపై ఆసక్తి చూపడం లేదన్నారు. సమ్మర్ క్యాంపు ద్వారా పిల్లలకు అన్ని రంగాల్లో సరైన శిక్షణ ఇస్తే విద్యార్థి దశలో క్రమశిక్షణ అలవరుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, ఆర్ఐలు సూరప్పనాయుడు, సంతోష్, శ్రీనివాస్, ఆర్ఎస్ఐ రాజీవ్, అశోక్, పీఈటీ నాగరాజు, కరాటే మాస్టర్ వంశీ, యోగ మాస్టర్ కిషన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



వేసవి శిబిరంలో చిన్నారులతో ఎస్పీ శరత్‌చంద్ర పవార్

అందుబాటులో విత్తనాలు, ఎరువులు



గుర్రంపోడులో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న జేడీఏ శ్రవణ్‌కుమార్

● జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్

గుర్రంపోడు, మే 8 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతులకు సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని గుర్రంపోడు, కొప్పోలు గ్రామాల్లో ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. రైతులకు విత్తనాలు, ఎరువులు ఎంత మేర నిల్వలు అందుబాటులో ఉన్నాయో ఎరువుల దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేసి నిర్ధారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు లైసెన్స్ ఉన్న డీలర్ల వద్ద మాత్రమే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేసిన ఎరువులు, విత్తనాలకు సంబంధించిన రసీదులను తీసుకొని వాటిని భద్రపరచుకోవాలని సూచించారు. మండలంలో 473 మెట్రిక్‌టన్నుల యూరియా, 147 మెట్రిక్‌టన్నుల డీఏపీ, 43 మెట్రిక్‌టన్నుల పొటాష్, 307 మెట్రిక్‌టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 45 మెట్రిక్‌టన్నుల సింగిల్ సూపర్ పాస్పేట్ అందుబాటులో ఉందని తెలిపారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి కంచర్ల మాధవరెడ్డి, తదితరులు ఉన్నారు.



కొనుగోళ్లు నిలిచిపోవడంతో వర్షభయంతో ధాన్యం రాశులపై పట్టాలు కప్పిన రైతులు

పెద్దకాపర్తిలో నిలిచిన ధాన్యం కొనుగోళ్లు

తహసీల్దార్ చర్చల అనంతరం ప్రారంభం

చిట్యాలరూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దకాపర్తి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో గురువారం కొనుగోళ్లు నిలిచాయి. ఎగుమతి కావాల్సిన ధాన్యం లారీ అక్కడే నిలిచింది. క్వింటాకు కిలోకు పైగా కోత విధించడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యంలో నూక శాతం అధికంగా వస్తున్నందున మిల్లర్లు కోత విధిస్తూ కొనుగోళ్లు నిలిపివేశారు. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ధాన్యంలో కోతలతో నష్టం వాటిల్లుతోందని రైతులు వాపోతున్నారు. మిల్లర్లు ధాన్యాన్ని దిగుమతి చేసుకోకపోతే కొనుగోళ్లు జరగక కేంద్రంలో ఉన్న ధాన్యం అలాగే నిలిచిపోతోందని కొనుగోళ్లు జరిగేలా చూడాలని, అందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరారు. కాగా, ధాన్యం కొనుగోళ్లు నిలిచాయని తెలుసుకున్న తహసీల్దార్ కృష్ణ కొనుగోలు కేంద్రం వద్దకు వెళ్లి పరిశీలించారు. మిల్లర్లతో చర్చించి ధాన్యంలో ఎలాంటి కోతలు లేకుండా దిగుమతి చేసుకోవాలని సూచించారు. దీనికి మిల్లర్లు సరేనని ఒప్పుకున్నారు. దీంతో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. కాగా, మరో రెండు రోజుల్లో ధాన్యం పూర్తిస్థాయి కొనుగోలు చేస్తామని తహసీల్దార్ తెలిపారు.

ముచ్చటగా మూడో షెడ్యూల్

- డిగ్రీ పరీక్షలకు ముహూర్తం
- ఈ నెల 14 నుంచి జూన్ 10 వరకు సెమిస్టర్ పరీక్షలు
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి
- విడుదల చేస్తేనే సహకరిస్తాం : ప్రైవేట్ యాజమాన్యాలు

• 7లో

టోల్‌ప్లాజా వద్ద మూడు గంటల వేట

- గంజాయి సమాచారంతో మొహరించిన పోలీసులు
- లభించని ఆచూకీ

• 6లో

భార్యలను గెంటేసిన తండ్రీకుమారులు

- కోడలికి మద్దతుగా నిరసనలో పాల్గొన్న అత్త

• 6లో

ఉపాధి హామీని నిర్వీర్యం చేసేందుకు కుట్ర

బీకేఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు కాంతయ్య



సమావేశంలో మాట్లాడుతున్న కలకొండ కాంతయ్య

నల్లగొండ రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని బీకేఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య అన్నారు. గురువారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశం సంఘ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు ఆరు గ్యారెంటీలు వర్తింపజేయాలని, కొత్త రేషన్ కార్డులు, వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల, ఒంటరి మహిళల పెన్షన్ ఇవ్వాలన్నారు. అదే విధంగా ఇల్లు లేని, ఇంటి స్థలం లేనివారికి స్థలాలు ఇచ్చి, ఇంటి నిర్మాణం కోసం రూ.6లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు లోడంగి శ్రావణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లుగి నర్సింహ, మాజీ జడ్పీటీసీ గోల్‌కొండ లింగయ్య, రామకోటి, పాల్గొన్నారు.

బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యం

చింతపల్లి, మే 8(ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే దేశం సుస్థిర పాలన సాధ్యమవుతుందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు తెలిపారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఉగ్రవాదుల నిర్మూలన దేశ ప్రధాని నరేంద్రమోదీ కృషి అమోఘమన్నారు. ప్రధాని ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు.

దేవరకొండలో వర్షం

దేవరకొండ, మే 7(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణంతోపాటు గ్రామాల్లో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో దేవరకొండ పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.ఉరుములు, మెరుపులతోకూడిన వర్షం కుర వడంతో ఉదయం ఎండతో అల్లాడిన ప్రజలు సాయంత్రం కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడింది.

ఆహ్లాదం సరే..సౌకర్యాలు ఏవీ..?

● దేవరకొండ మునిసిపల్ పార్క్‌లో వసతులు కరువు ● ఇబ్బందులు పడుతున్న పర్యాటకులు

దేవరకొండ ఖిల్లాకు సుదీర్ఘ చరిత్ర ఉండడం, చారిత్రక కట్టడాలు, దేవాలయాలు, కోనేరు చూసేందుకు స్థానికులు, వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. ప్రజలకు పార్కు ఆహ్లాదం కల్పించడానికి ఐదు ఎకరాల్లో నిర్మించినప్పటికీ వసతులు, భద్రత లేకపోవడంతో పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. సీసీ కెమెరాలతో నిఘా, సెక్యూరిటీ, భద్రత కల్పించాలని, ఫుడ్‌కోర్టు ఏర్పాటు చేయాలని పర్యాటకులు కోరుతున్నారు. (ఆంధ్రజ్యోతి -దేవరకొండ)

సుదీర్ఘ చరిత్ర ఉన్న దేవరకొండ ఖిల్లాలో ఇటీవల ఏర్పాటు చేసిన పార్కులో సౌకర్యాలు, భద్రత లేకపోవడంతో పర్యాటకులు ఇబ్బందులుపడుతున్నారు. 5 ఎకరాల్లో రూ.5 కోట్లతో ఇటీవల పార్కును ప్రారంభించారు. వేసవి కావడంతో పర్యాటకుల రద్దీ పా ర్కుకు విపరీతంగా పెరిగింది. పార్కులో కనీ సం తాగునీటి సౌకర్యం కూడ మునిసిపల్ అధికారులు కల్పించలేదు. తాగునీరు, క్యాంటిన్, ఫుడ్‌కోర్టు ఏర్పాటు చేయలేదు.



దేవరకొండ పార్కులో పర్యాటకుల రద్దీ

వీధి దీపాలు లేక అవస్థలు

రాత్రివేళలో ఖిల్లాలోకి వెళ్లేందుకు దారి వెంట కొంతదూరం వీధి దీపాలు లేకపోవడం, పార్కు పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, భద్రత లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు ఆకతాయిలు మద్యం తాగి ఇబ్బందులకు గురిచేస్తున్నారని పర్యాటకులు తెలుపుతున్నారు. పార్కులో వాకింగ్ ట్రాక్, చిన్నపిల్లల కోసం ఆట సామాగ్రి, అందమైన పూల మొక్కలు, వ్యాయామ పరికరాలు, చెట్లకు నీరందించేందుకు డ్రిప్ ఇరిగేషన్ విధానం ఏర్పాటు, పార్కులో రోడ్లు, లైట్లు ఏర్పాటు చేశారు. పూలచెట్లు ఆహ్లాదకరంగా ఉండడంతో దేవరకొండ పట్టణంతోపాటు ఇతర ప్రాంతాల నుంచి పర్యాటకుల రద్దీ పెరిగింది. ప్రస్తుతం మునిసిపల్ పార్కు నిర్వాహణ చేస్తుంది. నలుగురు సిబ్బందిని నియమించి పార్కు నిర్వాహణ ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలుపుతున్నారు.



పార్కులో ఏర్పాటు చేసిన లైట్లు



ఆహ్లాదకరంగా ఉన్న పూలమొక్కలు

సౌకర్యాలు కల్పించాలి



ఖిల్లాలోని పార్కుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా ఏర్పాటు చేయాలి. పర్యాటకులకు తాగు నీరు, క్యాంటిన్ వంటి సౌకర్యాలు కల్పించాలి. ముందు నుంచి ఖిల్లాకు వెళ్లేదారిలో లైట్లు ఏర్పాటు చేయాలి. పార్కులో మౌలిక సదుపాయాలు కల్పించాలి.

-కుల్‌కుందాకార్ శ్రీను, దేవరకొండ

ఫుడ్‌కోర్టు ఏర్పాటు చేస్తాం



దేవరకొండ ఖిల్లాలో పార్కు నిర్వాహణ ప్రస్తుతం మునిసిపాలిటీ నిర్వహిస్తోంది. నలుగురు ఉద్యోగులు పనిచేస్తున్నారు. పర్యాటకుల రద్దీ పెరిగింది. పోలీస్ అధికారుల సహకారంతో సీసీ కెమెరాలు, ఖిల్లాకు వెళ్లేదారిలో గేటు ఏర్పాటు చేస్తాం. ఫుడ్‌కోర్టు ఏర్పాటు చేసి సౌకర్యాలు, భద్ర త కల్పిస్తాం.

-సుదర్శన్, మునిసిపల్ కమిషనర్, దేవరకొండ

బుద్ధవనంలో వైద్య శిబిరం నిర్వహణకు ఏర్పాట్లు



బుద్ధవనంలో స్థల పరిశీలన చేస్తున్న డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్, సిబ్బంది

నాగార్జునసాగర్, మే8 (ఆంధ్రజ్యోతి): ప్రపంచపర్యాటక కేంద్రమైన నాగార్జున సాగర్‌కు ఈ నెల 12న మిస్ వరల్డ్ -2025 పోటీదారులు వస్తున్న నేపథ్యంలో బుద్ధవనంలో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ తెలిపారు. సాగర్ హిల్‌కాలనీలోని బుద్ధవనంలో వైద్యశిబిరం ఏర్పాటుకు స్థానిక ఆరోగ్య శాఖ సిబ్బందితో కలిసి స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మా ట్లాడుతూ కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు ఈ నెల 12న విజయవిహార్, బుద్ధవనం వద్ద వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బ్లడ్ బ్యాంకులో అన్ని గ్రూపుల బ్లడ్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ కేశరవి, ప్రోగ్రాం అధికారి కృష్ణకుమారి, వైద్యులు నగేష్, విజయవిహార్ మేనేజర్ కిరణ్‌కుమార్, బుద్ధవనం ఈవో రవిచంద్ర ఉన్నారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

పెద్దవూర :మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్యం గురించి ఆరా తీశారు. ఆసుపత్రిలో ఉన్న మం దులను, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో కేస రవి, మండల వైద్యాధికారి నగేష్ ఉన్నారు.

ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలి

● స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ



కరాటే వేసవి శిబిరాన్ని ప్రారంభిస్తున్న అధ్యక్షుడు ఎన్‌వీటీ

దేవరకొండ, మే 8(ఆంధ్రజ్యోతి): ఆత్మ రక్షణకు కరాటే దోహదపడుతుందని స్పోర్ట్స్ అసోసియేషన్ దేవరకొండ అధ్యక్షుడు ఎన్‌వీటీ అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మార్షల్ ఆర్ట్స్, కరాటే వేసవి శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది వేసవి శిబిరాలు నిర్వహించి కరాటేలో యువతకు, విద్యార్థిని, విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు శ్రీధర్‌గౌడ్, కృష్ణకిషోర్, నిరంజన్, రమేష్, మాస్టర్ ఏడుకొండలు, అనిల్ పాల్గొన్నారు.

కొండమల్లేపల్లిలో టొయోటా షోరూం ప్రారంభం



షో రూమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

కొండమల్లేపల్లి, మే8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నల్లగొండ రోడ్డులో కొత్తగా ఏర్పాటు చేసిన టొయోటా షోరూమ్‌ను దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినియోగ దారులకు నాణ్యమైన సేవలందించాలని సూచించారు. అనంతరం షోరూమ్ నిర్వాహకులు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీని సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎంఏ.సిరాజ్‌ఖాన్, వేమన్‌రెడ్డి, నాయిని మాధవరెడ్డి, వేమన్‌రెడ్డి, రేఖా శ్రీధర్‌రెడ్డిపాల్గొన్నారు.

ఐక్యంగా ఉండి మతసామరస్యాన్ని కాపాడాలి



మతపెద్దలతో మాట్లాడుతున్న సీఐ శ్రీను నాయక్

నాగార్జునసాగర్,మే8(ఆంధ్రజ్యోతి):ప్రజలందరు ఐక్యంగా ఉండి మతసామరస్యాన్ని కాపాడాలని సాగర్ సీఐ శ్రీను నాయక్ సూచించారు. గురువారం సాగర్ పోలీస్ సర్కిల్ కార్యాలయంలో గురువారం స్థానికంగా ఉన్న వివిధ మతాల పెద్దలతో నిర్వహించిన సమా వేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం భారత్-పాకిస్తాన్ మధ్య జరుగుతున్న ఘర్షణ నేపథ్యంలోసోషల్ మీడియాలో వచ్చే బూటకపు ప్రచారాలను నమ్మవద్దన్నారు. ఎవరైనా మతాలను రెచ్చగొట్టె విధంగా పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవన్నారు. నిరసనలు, ర్యాలీలు, ధర్నాలు నిర్వహించాలనేకుంటే ముందుగా పోలీస్ వారి అనుమతి తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎస్‌ఐ సంపత్ ఉన్నారు.

మూగ జీవాల అక్రమ రవాణా చేస్తే చర్యలు



చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న జేడీ రమేష్

నాగార్జునసాగర్,మే8(ఆంధ్రజ్యోతి): మూగ జీవాలను అక్రమంగా కబేళాలకు తరలిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా పశువైద్యశాఖ జేడీ డాక్టర్ రమేష్ హెచ్చరించారు. సాగర్ ఫైలాన్ కాలనీలో ఏపీ- తెలంగాణ సరిహద్దులో కొత్త వంతెన వద్ద ఏర్పాటు చేసిన పశువుల చెక్ పోస్టును గురువారం ఆయన తనిఖీ చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి పశువులు అక్రమంగా తరలించే వాహనాలను గుర్తించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. అలాంటి వాహనాలను పోలీస్ స్టేషన్‌కు అప్పగించాలని సిబ్బంది ని ఆదేశించారు. అనంతరం హిల్‌కాలనీలో స్థానిక పశువైద్యశాలలో రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు. ఆయన వెంట స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ కేశవ్ అజ్మీరా, సిబ్బంది తదితరులు ఉన్నారు.

పోలీసుల అదుపులో ముగ్గురు జూదరులు

డిండి, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరుకుపల్లి శివారులో ఓ రేకుల షెడ్‌లో పేకాటడుతున్న ముగ్గురిని గురువారం పోలీసులు అదుపులోకి తీసు కున్నా రు. ఎస్‌ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. రేకులషెడ్ పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో స్థావరంపైదాడి నిర్వ హించారు. ఈ దాడుల్లో ముగ్గురును అదుపులోకి తీసుకోగా మరో ఇద్దరు పారిపోయారు. అదుపులో తీసుకున్న వారి నుంచి రూ.1020 నగదు మూడు సెల్‌ఫోన్లు, రెండు బైక్‌లు స్వాధీనం చేసు కున్నట్లు చెప్పారు. బాధ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సైన్యానికి మద్దతుగా సంఘీభావ ర్యాలీ



అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద ర్యాలీ తీస్తున్న అఖిలపక్ష నాయకులు

పెద్దఅడిశర్లపల్లి, మే8(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ పేరిట పాకిస్తాన్ ఉగ్రమూకల స్థావరాలను ధ్వంసం చేసిన భారత సైన్యానికి మద్దతుగా గురువారం అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద అఖిలపక్షం ఆధ్వర్యంలో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. దేశ పౌరుడిగా మన సాయుధ దళాలకు బలంగా అండగా నిలుస్తామని నినాదాలు చేశారు. కార్యక్రమంలో అలుగుబెల్లి శ్రీనివాస్‌రెడ్డి, పల్లా సురేందర్‌రెడ్డి, వర్కాల నాగిరెడ్డి, ఒట్టేపు గోవర్ధన్, డీలర్ శ్రీనునాయక్, వరికుప్పల శ్రీరాములు, అంతిరెడ్డి, నేలపట్ల శ్రీను, నరేంధర్‌రెడ్డి తాళ్ల మల్లయ్య పాల్గొన్నారు.

బైక్‌ను ఢీ కొట్టిన ట్రాక్టర్ వ్యక్తికి గాయాలు

మాడ్గులపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుక్కడం గ్రామ శివారులో బైక్, ట్రాక్టర్ వెనుక నుంచి ఢీకొట్టిన సంఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తోపుచర్ల గ్రామానికి చెందిన బొప్పని సుధాకర్ బైక్‌పై తోపుచర్ల నుంచి తిప్పర్తికి వెళ్తుండగా మార్గమధ్యలో కుక్కడం గ్రామ శివారులోకి రాగానే సకారి ఉత్తమ్ ట్రాక్టర్‌ను అజాగ్రత్తగా నడుపుతూ సుధాకర్ వెళ్తున్న బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో సుధాకర్ తలకు తీవ్రగాయాలు కావడంతో మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు సుధాకర్ భార్య బొప్పని విజయలక్ష్మీ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.

అక్కడ జలకళ..ఇక్కడ వెలవెల

● పాలేరు వాగుపై మూడు చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి శ్రీకారం ● రెండు పూర్తి, ఒకటి అసంపూర్తి ● నాలుగేళ్లుగా కొనసాగుతున్న సల్కునూరు -రావులపెంట గ్రామాల మధ్య చెక్ డ్యామ్



జలకళను సంతరించుకున్న కామేపల్లి చెక్‌డ్యామ్,



అసంపూర్తి పనులతో వెలవెలబోతున్న సల్కునూరు- రావులపెంట చెక్ డ్యామ్

(ఆంధ్రజ్యోతి -వేములపల్లి)

పాలేరు జలాలను వృథాగా పోకుండా అడ్డుకట్ట వేసి సాగు, తాగు నీటి కష్టాలను తీర్చాలన్న తలంపుతో చేపట్టిన చెక్‌డ్యామ్‌ల నిర్మా ణం నాలుగేళ్లుగా నత్తనడకన కొనసాగుతున్నాయి. మండలంలోని సల్కునూరు, రావులపెంట గ్రామాల మధ్య ప్రవహిస్తున్న పాలేరు వాగుపై 2020 జూలైలో రూ.2.48 కోట్లతో చెక్‌డ్యామ్ నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ 2021లో పనులను ప్రారంభించారు. ప్రారంభ దశలో పనులు వేగంగా చేపట్టిన కాంట్రాక్టర్ ఆ తరువాత పనుల పట్ల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తూ రావడంతో నేటికి నిర్మాణం అసంపూర్తిగానే ఉండిపోయింది. నాటి నుంచి పలుమార్లు పనులను చేపట్టాలని కాంట్రాక్టర్‌ను అధికారులు ఆదేశిస్తున్నప్పటికీ నిర్లక్ష్యం గా వ్యవహరించడంతో ఆరుసార్లు నోటీసులు సైతం జారీ చేసినా నిర్మాణ పనులను మాత్రం పూర్తి కాలేదు. ఇప్పటివరకు రూ.1.87 కోట్ల మేరా పనులను చేపట్టడంతో సదరు కాంట్రాక్టర్‌కు రూ.1.50 కోట్లను చెల్లించినట్లు అధికారులు తెలిపారు. ఇంకా రూ.67 లక్షల పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని పూర్తి చేయాలని ఒత్తిడి తెస్తున్నప్పటికీ సదరు కాంట్రాక్టర్ తనకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండడంతో నాలుగేళ్లుగా పాలేరు జలాలు వృథాగా కిందకు పోతున్నాయి. కొద్ది రోజులుగా అధికారులు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకురాగా ఇటీవల పనులను పునఃప్రారంభించారు.

పూర్తయినవి ఇవీ..

పాలేరు వాగుపై సల్కునూరు సమీపంలో రూ.4.32 కోట్లతో మరొకటి, కామేపల్లి గ్రామ శివారులో రూ.3.44 కోట్లతో మరో చెక్‌డ్యాం నిర్మాణానికి 2023 అక్టోబర్ 3న ప్రారంభించారు. వాటి నిర్మాణ పనులు పూర్తయి ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా జలకళతో కళకళలాడుతున్నాయి. కానీ వీటికంటే ముం దు ప్రారంభించిన సల్కునూరు, రావులపెంట చెక్ డ్యాం నిర్మాణ పనులు మాత్రం ఇంతవరకు పూర్తి కాకపోవడం పలు విమర్శలకు దారితీసింది. దీంతో సమీపంలో భూగర్భజలాలు గణనీయంగా తగ్గిపోవడంతో పాటు పశుపక్ష్యాదులు నీటి కోసం అలమటించాల్సిన పరిస్థితి నెలకొంది. సదరు కాంట్రాక్టర్ పనులను వేగవంతంగా పూర్తి చేసి ఈ సారైనా పాలేరు జలాలు వృథా పోకుండా వానాకాలం నాటికి జలకళను సంతరించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సమీప గ్రామాల ప్రజలు, రైతులు కోరుకుంటున్నారు.

పనులను పూర్తి చేయాలి



చెక్‌డ్యాం అసంపూర్ణంగా ఉండడంతో పాలేరు జలాలు వృథా గా పోతున్నాయి. దీంతో సమీపంలో భూగర్భజలాలు తగ్గి బోరుబావుల ఆధారంగా సాగు కష్టంగా మారుతుంది. మరోవైపు వరద సమయంలో చెక్ డ్యాం పనులు పూర్తి కాకపోవడంతో ఇరువైపులా భూమి కోతకు గురై పంట పొలాలు నష్టపోతున్నాం. అధికారులు పనులు పూర్తయ్యేలా కృషి చేయాలి.

- జెర్రిపోతుల చంద్రయ్య (రైతు, సల్కునూరు)

నెల రోజుల్లో పూర్తయ్యేలా కృషి

చెక్‌డ్యామ్ నిర్మాణంలో మిగిలిన పనులను మరో నెల రోజు ల్లో పూర్తయ్యేలా కృషి చేస్తాం. ఇప్పటికే కాంట్రాక్టర్ పెండింగ్ పనులను పునఃప్రారంభించారు. ఈ సీజన్‌లో పాలేరు జలాలు వృథాగా కిందకు పోకుండా చెక్‌డ్యామ్ నిర్మాణ పనులను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నాం.

-పాండునాయక్ (ఇరిగేషన్ ఈఈ)

డీలర్లు నిబంధనలు పాటించాలి

● ఎస్‌ఐ సతీష్‌రెడ్డి, ఏవో సరిత

హాలియా, మే 8(ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణాల డీలర్లు నిబంధనలు పాటి ంచాలని హాలియా ఎస్.ఐ. సతీష్‌రెడ్డి, ఏవో ఎం. సరిత అన్నారు. ఎరువుల దుకాణ డీలర్లతో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. విత్తనాల విక్రయ విషయంలో పాటించాల్సిన నిబంధనలు, రైతులు వారికి అమ్మిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు సంబంధించిన బిల్లులు తప్పని సరిగా ఇవ్వాలి, ఎమ్మార్పీకి విక్రయించాలని డీలర్లకు సూచించారు. డీలర్లు ధరల పట్టిను, నిల్వల పట్టీలను, స్టాక్ రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలు, ఇన్వైసిస్ షాపులలో మెయింటెన్ చేయాలని తెలిపారు. ఎరువులతో పాటు ఇతర ప్రొడక్ట్‌ను రైతులకు బలవంతంగా అంటకట్ట కూడదని, డీలర్లు నిబంధనలు పాటించని యెడల వారిపై చట్ట ఎరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎరువుల దుకాణ డీలర్లు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హాలియా ఎస్‌ఐ సతీష్‌రెడ్డి, ఏవో సరిత